www.vishalabharati.com
epaper.vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
18 నవంబర్ 2026
సంపుటి:4 సంచిక: 310

విశాల భారతి

తెలుగు దినపత్రిక



అధికారులా.. వ్యాపారులా!

- ఏనుమాముల మార్కెట్‌లో అధికారులు, వ్యాపారుల మధ్య వివాదం
- తూకాలు, హమాలీ చార్జీల్లో అక్రమాలపై అధికారుల తనిఖీలు
- ఉల్లంఘనలపై పలువురు వ్యాపారులకు నోటీసులు జారీ
- వ్యాపారుల నిరసనతో పత్తి కొనుగోళ్లు బంద్
- కలెక్టర్ జోక్యం చేసుకున్నా మారని మార్కెట్ పరిస్థితులు

02



కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా

- తెలంగాణలో కోటి కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా
- ఇందిరమ్మ బీమా దరఖాస్తు విడుదల చేయనున్న సీఎం
- ప్రభుత్వ బీమా పథకాలన్నీ ఒకే గొడుగు కిందకు
- గ్రామస్థాయిలోనే బీమా దరఖాస్తుల అందుబాటు
- నవంబర్ 19న సిద్దిపేటలో ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం
- చీరల పంపిణీలో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

03



విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- నల్లకుంచె గురుకులంలో జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆలోచింపచేసిన విద్యార్థుల

06

- ప్రభుత్వ విద్యాసంస్థలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

సమ్మక్క సాగర్‌కు లైన్ క్లియర్ అవుతుందా?



సమ్మక్క సాగర్ ఎన్వోసీ కోసం రేవంత్ ప్రయత్నాలు

- ఛత్తీస్‌గఢ్ సీఎం విష్ణుదేవ్ సాయితో భేటీ
- ఎన్వోసీ ప్రక్రియ వేగవంతం చేస్తామని హామీ
- ఐఐటీ అధ్యయనంలో 33 ఎకరాలకే ముంపు అంచనా
- సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం ఇప్పటికే పూర్తి
- ప్రాజెక్టుతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీటి లక్ష్యం



విశాలభారతి, స్టేట్ బ్యూరో:


సమ్మక్క సాగర్ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలు స్పీడ్ పెంచారు. రెండు రోజుల క్రితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఈ అంశంపై చర్చించిన ఆయన, తాజాగా ఢిల్లీ నుంచి నేరుగా ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు వెళ్లారు. అక్కడ ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయితో కీలక సమావేశం నిర్వహించారు. గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి నిరభ్యంతర పత్రం జారీ చేయాలని కోరారు. తెలంగాణలో పెరుగుతున్న నీటి అవసరాలు, ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వర్షాభావ పరిస్థితులను వివరించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రాజెక్టును ప్రజలకు ఉపయోగపడేలా మార్చాలంటే ఛత్తీస్‌గఢ్ సహకారం తప్పనిసరని స్పష్టం చేశారు. బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతితో పాటు పెండింగ్‌లో ఉన్న ఇతర క్లియరెన్స్‌లను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ భేటీలో తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. దీంతో రెండు రాష్ట్రాల మధ్య ప్రాజెక్టుకు సంబంధించిన చర్చలు మరోసారి కీలక దశకు చేరుకున్నాయి. సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయినా పూర్తిస్థాయిలో నీటిని నిల్వ చేయడానికి ఛత్తీస్‌గఢ్ ఎన్వోసీ ప్రధాన అడ్డంకిగా మారింది. బ్యారేజీలో నీటిమట్టం పెరిగితే బ్యాక్‌వాటర్ ప్రభావంతో తమ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలు ముంపునకు గురవుతాయనేది ఛత్తీస్‌గఢ్ అభ్యంతరం. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. ఛత్తీస్‌గఢ్ పరిధిలో అవసరమయ్యే భూసేకరణ, బాధితులకు పరిహారం, పునరావాస ఖర్చులను నిబంధనల ప్రకారం భరించేందుకు సిద్ధమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రతిపాదనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సానుకూలంగా స్పందించినట్లు తెలంగాణ మిగతా 2లో..

భారత్ సమ్మిట్ కాదు.. కాంగ్రెస్ సమ్మిట్

- భారత్ సమ్మిట్‌తో తెలంగాణకు ప్రయోజనం లేదని కేటీఆర్ విమర్శ
- కాంగ్రెస్ నేతల పేర్లతో ఉన్న ప్రాజెక్టుల పేర్లు మారుస్తామని ప్రకటన
- కాళేశ్వరం పేరు మార్చడంపై కేటీఆర్ అభ్యంతరం
- అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై ఆగ్రహం
- 365 కరువు మండలాల్లో సహాయక చర్యలు లేవని విమర్శ
- ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు పనుల కేటాయింపుపై ప్రశ్న

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అంతర్జాతీయ వేదిక అంటూ భారీగా ప్రచారం చేసిన ఈ కార్యక్రమంతో రాష్ట్ర ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిర్వహించిన సదస్సుగా కాకుండా కాంగ్రెస్ పార్టీ తన రాజకీయ గుర్తింపు పెంచుకునేందుకు ఏర్పాటు చేసుకున్న వేదికగా అభివర్ణించారు. ప్రజలకు ఉపయోగపడే కొత్త ప్రాజెక్టులు, పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం ప్రచార కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో పరిష్కరించాల్సిన మిగతా 2లో..



ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం



- ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలమైందని హరీశ్ రావు విమర్శ
- నెల రోజులుగా కొనుగోళ్ల కోసం రైతుల ఎదురుచూపులు
- సన్నవడ్ల బోనస్‌పై వెంటనే జీవో విడుదల చేయాలని డిమాండ్

03

- క్వింటాల్‌కు 10 కిలోల తరుగు తీస్తున్నారని ఆరోపణ
- పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్
- యాసంగి రైతుబంధు నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు

‘భరోసా’ ఎవరికి.. ‘చేయూత’ ఎందరికి?

- రైతుభరోసా, చేయూత పథకాల్లో భారీగా లోపాలు
- రైతుభరోసా లబ్ధిదారుల్లో 20.5శాతం మంది సంపన్నులు, భూస్వాములే
- సాగు చేస్తున్న కౌలు రైతులకు అందని పెట్టుబడి సాయం
- చేయూత లబ్ధిదారుల్లో 16శాతం మంది మరణించినవారే
- 2024-25లో రెండు పథకాల కింద రూ.17,025 కోట్ల పంపిణీ
- రైతుభరోసా, చేయూతపై సెస్ అధ్యయనంలో కీలక వెల్లడులు

02



ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసమా?

- పేదల కోసం పనిచేయాలన్న కోమటిరెడ్డి
- వృద్ధాప్య పింఛన్ రూ.5 వేలకు పెంచాలని డిమాండ్
- పింఛన్ పెంపుపై ప్రజలు నిలదీస్తున్నారని వెల్లడి
- వృద్ధులకు కూడా కొత్త పింఛన్లు ఇవ్వాలని సూచన
- పింఛన్ పెంపు అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ
- అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందాలని స్పష్టం



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

కాంగ్రెస్ ప్రభుత్వంపై సొంత పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వాలు పనిచేయాల్సింది కాంట్రాక్టర్లు, పెట్టుబడిదారులు, ధనవంతుల కోసం కాదని, పేదల కోసమేనని స్పష్టం చేశారు. మంగళవారం చౌటుప్పల్ మండలం దామెరలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నూతన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం మరింత వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో ఇచ్చిన పింఛన్ల పెంపు హామీని గుర్తుచేస్తూ సొంత ప్రభుత్వానికే చురకలంటించారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం పాలకుల బాధ్యతని గుర్తుచేశారు. అధికారంలో ఏ పార్టీ ఉన్నా పేదల ప్రయోజనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదాయం అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా చేరాలని కోరారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో సామాన్యుల జీవనం భారంగా మారిందని కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో వృద్ధాప్య పింఛన్ నాలుగు వేల రూపాయలు ఇచ్చినా సరిపోదని, ఐదు వేలు అందించినా తక్కువేనని వ్యాఖ్యానించారు. పింఛన్లు పెంచుతామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో గ్రామాల్లో ప్రజలు మిగతా 2లో..



మెట్రో విడిచి పీఆర్‌టీఎస్ సాము!

- మెట్రో రైలు విస్తరణపై సర్కారు చేతులెత్తేసినట్లేనా?
- ఎనిమిది ప్రాంతాల్లో పీఆర్‌టీఎస్‌పై సర్వే
- మొదటి దశలో 34.46 కిలోమీటర్ల లీ అసోసియేట్స్ అధ్యయనం
- కిలోమీటరుకు రూ.419 కోట్ల చొప్పున రూ.13వేల కోట్ల అంచనా వ్యయం
- పీఆర్‌టీఎస్‌పై మెట్రో కంటే కిలోమీటర్‌కు అదనంగా రూ.50 కోట్ల వ్యయం
- మెట్రో మొదటి దశ టేకోవర్‌పై కొనసాగుతున్న రోజుకు రూ.2 కోట్ల భారం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ మెట్రో విస్తరణపై కాంగ్రెస్ సర్కారు చేతులెత్తేసిందా? మెట్రో మొదటి దశను టేకోవర్‌పై అనాలోచితంగా.. దూకుడుగా వ్యవహరించిన రేవంత్ ప్రభుత్వ పరిస్థితి ఇప్పుడు ‘ముందు నుయ్యి.. వెనుక గొయ్యి’లా తయారైందా? కేంద్రం మొదటి దశవిస్తరణ ప్రాజెక్టుకు లింకు పెట్టడంతో రాష్ట్ర ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితిలో చిక్కుకుందా? మూడు మిగతా 3లో..



విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు!

ఇంటర్ బోర్డు రద్దుపై కవిత అభ్యంతరం

- పరిపాలనా మార్పులే విద్యా సంస్కరణలు కావన్న కవిత
- డ్రాపౌట్స్‌లో తెలంగాణ టాప్-5లో ఉందని వెల్లడి
- నాణ్యమైన విద్యలో తెలంగాణ 28వ స్థానంలో ఉందని ఆందోళన
- ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవద్దని ప్రభుత్వానికి హెచ్చరిక
- విద్యార్థులు, తల్లిదండ్రులతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్

విశాలభారతి, స్టేట్ బ్యూరో: తెలంగాణలో ఇంటర్ బోర్డు రద్దు అంశం విద్యారంగంలో కొత్త చర్చకు దారితీసింది. ఈ నిర్ణయంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యా సంస్కరణల పేరుతో కేవలం పరిపాలనా వ్యవస్థను మార్చడం సరైన విధానం కాదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమాజిగూడలో నిర్వహించిన ఇంటర్ బోర్డు రద్దు, తెలంగాణ విద్యపై ప్రభావం అనే రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలంటే ముందుగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సూచించారు. బోర్డుల పేర్లు, నిర్వహణ విధానాలు మార్చినంత మాత్రాన చదువులో మిగతా 3లో..

‘భరోసా’ ఎవరికి..‘చేయూత’ ఎందరికి?

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రారంభించిన రైతుబంధు పథకం.. ఇప్పుడు రైతుభరోసాగా కొనసాగుతోంది. మరోవైపు పేదలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు తీసుకొచ్చిన ఆసరా పింఛన్ల పథకం.. ప్రస్తుతం చేయూత పేరుతో అమలవుతోంది. పేర్లు మారాయి.. ప్రభుత్వాలు మారాయి.. పథకాల అమలు విధానాలు కూడా మారాయి. కానీ ఈ రెండు పథకాల అమలులో ఉన్న లోపాలు మాత్రం ప్రజాధనం దుర్వినియోగానికి కారణమవుతున్నాయని తాజాగా వెలుగులోకి వచ్చిన అధ్యయనం సంచలన విషయాలను బయటపెట్టింది. నిజంగా వ్యవసాయం చేస్తున్న రైతులకు అందాల్సిన పెట్టుబడి సాయం భూస్వాములు, సంపన్న రైతుల ఖాతాల్లోకి వెళ్తుండగా.. పేదలకు అందాల్సిన పింఛన్లు మరణించిన వారి పేర్ల మీద కూడా పంపిణీ అవుతున్నాయని ఈ నివేదిక వెల్లడించింది. సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ అంటే సెస్ రూపొందించిన అధ్యయనం ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోని లోపాలను స్పష్టంగా బయటపెట్టింది. సంక్షేమం పేరుతో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నప్పటికీ అర్హులకు పూర్తి స్థాయిలో ప్రయోజనం అందడం లేదనే అంశం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముందుగా రైతుభరోసా పథకం విషయానికి వస్తే.. రైతులకు సాగు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయ ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలనే లక్ష్యంతో 201819 ఆర్థిక సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రారంభించింది. ప్రతి సంవత్సరం వానాకాలం, యాసంగి రెండు సీజన్లకు పెట్టుబడి సాయం అందించే విధానాన్ని తీసుకొచ్చింది. అయితే ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి 202425 ఆర్థిక సంవత్సరం వరకు ఏకంగా 86,028 కోట్ల రూపాయల ప్రజాధనం పంపిణీ అయినట్లు అధ్యయనం వెల్లడించింది. ఇంత భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసినప్పటికీ పథకం అసలు



లక్ష్యం ఎంతవరకు నెరవేరిందనే విషయంలో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా భూమి సొంతంగా ఉన్నవారికే సాయం అందించే విధానం వల్ల నిజంగా పంటలు సాగు చేస్తున్నవారికి కాకుండా భూమి యజమానులకే ప్రాధాన్యత లభిస్తోంది. వ్యవసాయ పనులు చేయకపోయినా భూమి పేరుతో పెట్టుబడి సాయం పొందుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో పథకం ఉద్దేశం, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అమలు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. ఈ అధ్యయనంలో బయటపడిన అత్యంత కీలకమైన విషయం సంపన్న రైతులు, భూస్వాములకు అందుతున్న ప్రయోజనాలు. రైతుభరోసా పథకం ద్వారా లబ్ధి పొందుతున్న వారిలో దాదాపు 20.5 శాతం మంది సంపన్న రైతులు, ఎక్కువ సాగుభూమి కలిగిన భూస్వాములేనని నివేదిక అంచనా వేసింది. అంటే వ్యవసాయం చేయకపోయినా, పెద్ద మొత్తంలో భూములు కలిగి ఉన్న కారణంగా కొంతమంది ప్రభుత్వ సాయాన్ని పొందుతున్నారు. మరోవైపు భూములు సొంతంగా లేకపోయినా ఇతరుల భూములను కౌలుకు తీసుకొని అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులకు మాత్రం ఈ పథకం నుంచి ఎలాంటి ప్రయోజనం అందడం లేదు. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించాల్సింది కౌలు రైతులే అయినప్పటికీ పెట్టుబడి సాయం మాత్రం భూమి యజమానులకే చేరుతోంది. అంతేకాకుండా గరిష్ట సాగుభూమిపై పరిమితి లేకపోవడం వల్ల ఎక్కువ భూములు ఉన్నవారికి భారీ మొత్తంలో ప్రజాధనం అందే అవకాశం ఏర్పడింది. నిజంగా సాగు చేస్తున్న రైతును గుర్తించకుండా కేవలం భూమి యాజమాన్యాన్ని ప్రామాణికంగా తీసుకోవడం వల్ల పథకంలో అసలు లబ్ధిదారులకే అన్యాయం జరుగుతోందని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది. ఇక పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అమలు చేస్తున్న ఆసరా పింఛన్ల పథకం కూడా లోపాలకు అతీతంగా లేదని నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం చేయూత పేరుతో కొనసాగుతున్న ఈ పథకం కింద గత ప్రభుత్వాల నుంచి ఇప్పటివరకు 202425 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఏకంగా 64,501 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. అయితే లబ్ధిదారుల ఎంపిక, అర్హతల పరిశీలనలో లోపాలు ఉన్నట్లు గతంలోనే కాగ్ నిర్వహించిన ఆడిట్‌లో వెల్లడైంది. 201819 నుంచి 202021 మధ్య గణాంకాలను పరిశీలించిన కాగ్.. దాదాపు 16 శాతం మంది లబ్ధిదారులు పథకానికి అర్హులు కారని గుర్తించింది. కొంతమందికి నిబంధనల్లో పేర్కొన్న పరిమితికి మించి భూములు ఉండగా, మరికొందరి పేర్లపై ఫోర్ వీలర్ వాహనాలు ఉన్నట్లు గుర్తించింది. తాజాగా సెస్ అధ్యయనం మరో ఆందోళనకరమైన అంశాన్ని ప్రస్తావించింది. చేయూత పథకం లబ్ధిదారుల జాబితాలో దాదాపు 16 శాతం మంది మరణించినవారి పేర్లు ఉన్నట్లు వెల్లడించింది. అంటే జీవించి ఉన్న అర్హులైన పేదలకు అందాల్సిన సంక్షేమ నిధులు, మరణించిన వ్యక్తుల పేర్ల మీద కూడా కొనసాగుతున్నాయనే విషయం ప్రభుత్వ వ్యవస్థలో పర్యవేక్షణ లోపాలను సూచిస్తోంది. రైతుభరోసా, చేయూత పథకాలను కలిపి చూస్తే 202425 ఆర్థిక సంవత్సరంలోనే ప్రభుత్వం 17,025 కోట్ల రూపాయలను ప్రజాధనంగా పంపిణీ చేసింది. ఒకవైపు రైతులకు పెట్టుబడి సాయం, మరోవైపు పేదలకు నెలవారీ ఆర్థిక భద్రత కల్పించడం ప్రభుత్వాల బాధ్యతే. అయితే వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం మాత్రమే సంక్షేమం అనిపించుకోదు. ఆ నిధులు నిజమైన లబ్ధిదారులకు చేరినప్పుడే పథకాల లక్ష్యం నెరవేరుతుంది. రైతుభరోసాలో సాగు చేస్తున్న కౌలు రైతులను గుర్తించడం, భూముల పరిమితిపై విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడం, చేయూతలో మరణించినవారి వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించడం, అనర్హులను తొలగించడం వంటి చర్యలు అత్యవసరంగా కనిపిస్తున్నాయి. ఆధార్, భూముల రికార్డులు, మరణ ధ్రువీకరణ వివరాలను సమన్వయం చేస్తూ పారదర్శకమైన లబ్ధిదారుల జాబితాలను రూపొందించాల్సిన అవసరం ఉంది. లేకపోతే పథకాల పేర్లు మారినా, ప్రభుత్వాలు మారినా ప్రజాధనం దుర్వినియోగం మాత్రం ఆగదు. సంక్షేమ పథకాల అసలు విజయం ఎంత డబ్బు ఖర్చు చేశామనే దానిలో కాదు.. ఆ డబ్బు ఎంతమంది అర్హులైన పేదలకు, నిజమైన రైతులకు చేరిందనే దానిలోనే ఉంటుంది.



ప్రభుత్వం కాంట్రాక్టర్ల కోసమా?


మొదటిపేజీ తరువాయి

తమను నిలదీస్తున్నారని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ఏమైందంటూ ప్రశ్నిస్తున్నారని చెప్పారు. ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాలని సూచించారు. పింఛన్ పెంపు కోసం లబ్ధిదారుల తరఫున తాను కూడా పోరాడతానని స్పష్టం చేశారు. వృద్ధాప్యంలో ఇతరులపై ఆధారపడకుండా జీవించేందుకు నెలవారీ ఆర్థిక సాయం ఎంతో అవసరమని వివరించారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రాబోయే రోజుల్లో అర్హులకు పెంచిన పింఛన్లు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గత పదేళ్లుగా కొత్త పింఛన్ల కోసం వేలాది మంది పేద మహిళలు ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో మునుగోడు ఉప ఎన్నిక సమయంలో మాత్రమే కొందరికి పింఛన్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ఎన్నో ఏళ్ల నిరీక్షణ తర్వాత ఇప్పుడు కొత్త చేయూత పింఛన్ల మంజూరు పత్రాలు అందించడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించడాన్ని అభినందించారు. అయితే వీరితో పాటు వృద్ధులకు కూడా కొత్త పింఛన్లు మంజూరు చేసి ఉంటే మరింత ఉపయోగకరంగా ఉండేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఎన్నో త్యాగాలతో సాధించుకున్నామని, ప్రత్యేక రాష్ట్రంలో తమ జీవితాలు మెరుగుపడతాయని ప్రజలు ఆశించారని గుర్తుచేశారు. కానీ ఇప్పటికీ పేదలకు ఆశించిన స్థాయిలో న్యాయం జరగలేదనే భావన ఉందన్నారు. కాంగ్రెస్ పేదల పార్టీ అని, సంక్షేమానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవైపు కొత్త పింఛన్ల మంజూరును అభినందిస్తూనే మరోవైపు పెంపు హామీ అమలుపై ప్రభుత్వాన్ని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి పాల్గొన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల ఎంపీడీవోలు కూడా హాజరయ్యారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, ఇతర అధికారులు కార్యక్రమంలో భాగమయ్యారు. చౌటుప్పల్ మున్సిపాలిటీతో పాటు చౌటుప్పల్, నారాయణపూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పింఛన్ల పెంపు విషయంలో ప్రజల తరఫున పోరాడతానని ఎమ్మెల్యే ప్రకటించడం ఈ కార్యక్రమంలో ప్రధాన అంశంగా నిలిచింది. ప్రభుత్వం పేదల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వాలనే సందేశాన్ని బలంగా వినిపించారు.

భారత్ సమ్మిట్ కాదు.. కాంగ్రెస్ సమ్మిట్

మొదటిపేజీ తరువాయి

సమస్యలు ఎన్నో ఉన్నప్పటికీ వాటిని పక్కనపెట్టి రాజకీయ హడావుడి చేస్తున్నారని మండిపడ్డారు. సమ్మిట్ నిర్వహణ కంటే దానివల్ల సామాన్యులకు కలిగే ప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్యానించారు. ప్రజల అవసరాలను గుర్తించి పనిచేయడమే ప్రభుత్వ అసలైన బాధ్యతని గుర్తుచేశారు. తెలంగాణలో అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాల పేర్ల మార్పుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ గట్టిగా టార్గెట్ చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో ప్రారంభించిన కార్యక్రమాల గుర్తింపును మార్చేందుకు ప్రభుత్వం ఎక్కువ ఆసక్తి చూపుతోందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ రైతుల సాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన భారీ కార్యక్రమమని గుర్తుచేశారు. అలాంటి ప్రాజెక్టుకు కొత్త పేరు పెట్టడం వల్ల రైతులకు అదనంగా కలిగే లాభం ఏంటని నిలదీశారు. సాగునీరు అందించడం, వ్యవసాయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. పేర్ల మార్పుతో అభివృద్ధి జరగదని, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే నిర్ణయాలే ముఖ్యమని పేర్కొన్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తే కాంగ్రెస్ నాయకుల పేర్లతో ఉన్న ప్రాజెక్టుల నింటి పేర్లను మారుస్తామని స్పష్టం చేశారు. ఇది రాజకీయంగా తన నిర్ణయమని కేటీఆర్ వెల్లడించారు. అన్నపూర్ణ క్యాంటీన్ల పేరును ఇందిరమ్మ క్యాంటీన్లుగా మార్చడంపైనా కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అన్నపూర్ణ దేవత పేరుతో కొనసాగిన పథకానికి ఇందిరమ్మ పేరు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. పేరు మార్చినంత మాత్రాన పేదలకు అందించే భోజనం నాణ్యత పెరగదని, వారి ఆర్థిక పరిస్థితులు కూడా మారిపోవని వ్యాఖ్యానించారు.



గత బీఆర్ఎస్ పాలనలో ప్రారంభించిన కేసీఆర్ కిట్ పథకాన్ని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించారు. గర్భిణులు, బాలింతలకు ఉపయోగపడేలా రూపొందించిన ఈ కార్యక్రమం ఎంతో విజయవంతమైందని పేర్కొన్నారు. అలాంటి పథకాన్ని పేరు మార్చడంతో పాటు పూర్తిగా నిలిపివేయడాన్ని తప్పుబట్టారు. రాజకీయ గుర్తింపు కోసం ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను దెబ్బతీయడం సరైన పద్ధతి కాదన్నారు. జయపాల్ రెడ్డి పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేస్తున్నారనే ప్రచారంపై తనకు స్పష్టత లేదని తెలిపారు. తెలంగాణలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని కేటీఆర్ మండిపడ్డారు. రాష్ట్రంలోని 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించినప్పటికీ అన్నదాతలకు సరైన సహాయం అందించలేదని ఆరోపించారు. పంటలు దెబ్బతిని ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు తక్షణమే ప్రత్యేక సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వ్యవసాయ రుణాల రీషెడ్యూల్‌పై ప్రభుత్వం ఇప్పటికీ నిర్ణయం తీసుకోకపోవడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. రైతులపై అప్పుల భారం పెరుగుతున్న సమయంలో వారికి ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కనిపిస్తున్న కరువుకు ప్రకృతి పరిస్థితుల కంటే ప్రభుత్వ వైఫల్యాలే కారణమని విమర్శించారు. ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదని, పాలకుల వికృతి వల్ల ఏర్పడిన కరువంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో సామాజిక న్యాయం ఎంతవరకు అమలవుతోందనే అంశాన్ని కూడా కేటీఆర్ తెరపైకి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన కాంట్రాక్టర్లకు ఎన్ని ప్రభుత్వ పనులు కేటాయించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి గురించి ప్రసంగాలు చేయడం మాత్రమే సరిపోదని, వారికి కల్పించిన అవకాశాలను లెక్కలతో సహా ప్రజల ముందుంచాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టుల పంపిణీలో ఆయా సామాజిక వర్గాలకు ఎంత ప్రాధాన్యం దక్కిందో చెప్పాలని కోరారు. ఒకవైపు కరువుతో రైతులు ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు సంక్షేమ కార్యక్రమాల పేర్లు మార్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం బిజీగా ఉందని విమర్శించారు. ప్రచార రాజకీయాలను పక్కనపెట్టి ప్రజలకు అవసరమైన సేవలు అందించడంపై దృష్టి పెట్టాలని సూచించారు. మాటల్లో చెప్పే సామాజిక న్యాయం ఆచరణలో కూడా కనిపించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

అధికారులా.. వ్యాపారులా!



విశాలభారతి, స్టేట్ బ్యూరో:

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో మొదలైన వివాదం ఇప్పుడు రైతుల పాలిట శాపంగా మారింది. మార్కెట్‌లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలతో అధికారులు తనిఖీలు చేపట్టి వ్యాపారులకు నోటీసులు జారీ చేయడం ఈ వివాదానికి ఆరంభమైంది. అయితే ఈ నోటీసులను వ్యాపారులు తీవ్రంగా వ్యతిరేకించడంతో పరిస్థితి క్రమంగా ఉద్రిక్తంగా మారింది. చివరకు వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేయడంతో మార్కెట్‌లో పత్తి క్రయవిక్రయాలు స్తంభించిపోయాయి. అధికారులు తమ విధులు నిర్వహించాలా, వ్యాపారుల అభ్యంతరాలకు తలొగ్గాలా అనే పరిస్థితి నెలకొంది. ఈ మొత్తం వ్యవహారంలో అసలు నష్టపోతున్నది మాత్రం ఏ తప్పూ చేయని రైతులే. పంటను అమ్ముకునేందుకు మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతులు కొనుగోళ్లు నిలిచిపోవడంతో రోజుల తరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మార్కెట్‌లోని బంధనలు అమలు చేయాలనే ప్రభుత్వ లక్ష్యం ఒకవైపు ఉంటే, వాటిని ప్రశ్నిస్తూ వ్యాపారులు బంద్‌కు దిగడం మరోవైపు ఈ వివాదాన్ని మరింత చర్చనీయాంశంగా మార్చింది. ఈ వివాదానికి ప్రధాన కారణం ఇటీవల నిర్వహించిన తనిఖీలు. ఈ నెల 4, 5 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నియమించిన లక్ష్మణుడి బృందం ఏనుమాముల మార్కెట్‌లో కొనుగోళ్లు, అమ్మకాల విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా పత్తి తూకాల్లో వ్యత్యాసాలు, హమాలీ చార్జీల వసూళ్లు, ఈనామ్ నమోదు, వే బ్రిడ్జి వినియోగం వంటి అంశాలపై దృష్టి సారించింది. గన్నీ బ్యాగుల పేరుతో అదనపు డబ్బులు వసూలు చేయడం, హమాలీ పని చేయకపోయినా చార్జీలు తీసుకోవడం, మిర్చి బస్తాల బరువులో కోత విధించడం వంటి ఆరోపణలను పరిశీలించింది. అంతేకాకుండా మార్కెట్‌కు సరుకు రాకపోయినా తక్కపట్టీలు జారీ చేసినట్లు వచ్చిన అంశాలపైనా తనిఖీలు జరిగాయి. ఈ పరిశీలనలో గుర్తించిన ఉల్లంఘనలపై వివరణ ఇవ్వాలంటూ ఈ నెల 10న పలువురు వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేశారు. సాధారణంగా మార్కెట్ వ్యవహారాల్లో పారదర్శకత తీసుకురావడానికి ఇలాంటి తనిఖీలు నిర్వహించడం అధికారుల బాధ్యత. అయితే నోటీసులు అందుకున్న వ్యాపారులు వాటిపై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో అధికారులకు, వ్యాపారులకు మధ్య విభేదాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో వ్యాపారి లింగారెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌తో వాగ్వాదానికి దిగిన ఘటన వివాదాన్ని మరో స్థాయికి తీసుకెళ్లింది. పత్తి బీట్ వద్ద జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు బయటకు రావడంతో వ్యవహారం మరింత సంచలనంగా మారింది. విధుల్లో ఉన్న అధికారితో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలతో లింగారెడ్డిపై ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీంతో వ్యక్తిగత స్థాయిలో మొదలైన వివాదం క్రమంగా వ్యాపారవర్గాల నిరసనగా మారింది. లింగారెడ్డికి మద్దతుగా వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ రంగంలోకి దిగింది. అధికారుల చర్యలను వ్యతిరేకిస్తూ మార్కెట్‌లో కొనుగోళ్లు నిలిపివేయాలని నిర్ణయించింది. ఫలితంగా పత్తి మార్కెట్ కార్యకలాపాలు నిలిచిపోయాయి. అయితే నోటీసులపై అభ్యంతరాలు ఉంటే వాటికి సమాధానం ఇవ్వడం, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం, చట్టపరమైన మార్గాలను అనుసరించడం వంటి అవకాశాలు ఉన్నాయి. గతంలో కూడా ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వ్యాపారులు ఉన్నతాధికారులతో చర్చించి పరిష్కరించుకున్న సందర్భాలున్నాయి. ఆరేళ్ల కిందట ఇలాంటి పరిస్థితి ఎదురైనప్పుడు చర్చల ద్వారా సమస్యను సామరస్యంగా పరిష్కరించుకున్నారు. ఇప్పుడు కూడా అదే పద్ధతిని అనుసరించి ఉంటే మార్కెట్ కార్యకలాపాలు నిలిచిపోయే పరిస్థితి వచ్చేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిరసన తెలిపే హక్కు వ్యాపారులకు ఉన్నప్పటికీ, ఆ నిరసన కారణంగా రైతుల అమ్మకాలు నిలిచిపోవడం మాత్రం తీవ్ర సమస్యగా మారింది. వివాదం ముదురుతుండటంతో వరంగల్ కలెక్టర్ సత్యశారద స్వయంగా రంగంలోకి దిగారు. ఆదివారం వ్యాపారులు, మార్కెట్ అధికారులతో సమావేశం నిర్వహించి పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రయత్నించారు. మార్కెట్ రికార్డులను తనిఖీ చేయడం, నిబంధనల ఉల్లంఘనలపై నోటీసులు ఇవ్వడం సాధారణ పరిపాలనా ప్రక్రియేనని కలెక్టర్ స్పష్టం చేశారు. తప్పు చేయనప్పుడు రికార్డులు చూపించడానికి అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని వ్యాపారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వివాదాన్ని మరింత పెద్దది చేయవద్దని ఇరువర్గాలకు హితవు పలికారు. అయినప్పటికీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోలేదు. సోమవారం నుంచి కొనుగోళ్ల బంద్ కొనసాగడంతో కలెక్టర్ జోక్యం కూడా తక్షణ ఫలితాన్ని ఇవ్వలేకపోయింది. ఇక్కడ గమనించాల్సిన మరో అంశం అధికారుల విధి నిర్వహణకు సంబంధించినది. మార్కెట్‌లో అక్రమాలు జరుగుతున్నాయనే అనుమానాలు వచ్చినప్పుడు వాటిని పరిశీలించకుండా అధికారులు ఎలా ఉంటారు. తనిఖీలు చేసినందుకు, నోటీసులు ఇచ్చినందుకు వారిపై ఒత్తిడి పెరిగితే భవిష్యత్తులో అధికారులు నిబంధనలు అమలు చేయడానికి వెనుకడుగు వేసే ప్రమాదం ఉంది. అదే సమయంలో అధికారులు జారీ చేసిన నోటీసుల్లో తప్పులు ఉంటే వాటిని కూడా నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. మొత్తంగా ఏనుమాముల మార్కెట్ వివాదం కేవలం అధికారులు, వ్యాపారుల మధ్య జరిగిన గొడవగా చూడలేం. ఇది వ్యవసాయ మార్కెట్లలో పారదర్శకత, జవాబుదారీతనం, రైతుల ప్రయోజనాలకు సంబంధించిన అంశంగా మారింది. మార్కెట్‌కు పంట తీసుకొచ్చిన రైతుకు సరైన తూకం రావాలి, అనవసరపు చార్జీల భారం పడకూడదు, అమ్మిన సరుకుకు సకాలంలో డబ్బులు అందాలి. ఇవన్నీ నిర్ధారించాల్సిన బాధ్యత మార్కెట్ యంత్రాంగంపై ఉంది.

సమ్మక్క సాగర్‌కు లైన్ క్లియర్ అవుతుందా?

మొదటిపేజీ తరువాయి

సీఎంవో వెల్లడించింది. ఎన్వోసీ ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపింది. గతంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా విష్ణుదేవ్ సాయిని కలిసి ఇదే అంశాన్ని ప్రస్తావించారు. ఇప్పుడు ముఖ్యమంత్రుల స్థాయిలో చర్చలు జరగడంతో అనుమతుల ప్రక్రియ ముందుకు కదిలే అవకాశాలు పెరిగాయి. అయితే ఎన్వోసీ జారీ అయిన తర్వాతే బ్యారేజీ పూర్తిస్థాయి వినియోగానికి కీలకమైన అడ్డంకి తొలగనుంది. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు వెనుక భారీ మార్పులే జరిగాయి. తొలుత ఈ బ్యారేజీని కాంతనపల్లి వద్ద నిర్మించాలని ప్రతిపాదించారు. కానీ అక్కడ ప్రాజెక్టు చేపడితే ఏకంగా 11,408 ఎకరాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని అంచనా వేశారు. అంతేకాదు 17 ఆదివాసీ గ్రామాలతో పాటు భద్రతా వ్యవస్థలు, మౌలిక సదుపాయాలపైనా ప్రభావం పడే పరిస్థితి కనిపించింది. దీంతో ముంపు నష్టాన్ని తగ్గించేందుకు నిర్మాణ ప్రాంతాన్ని ములుగు జిల్లా తుపాకులగూడెంకు మార్చారు. ఈ మార్పు ఎంతవరకు ప్రయోజనకరమో ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం స్పష్టం చేసింది. పూర్తిస్థాయి నీటిమట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో దాదాపు 33 ఎకరాలు మాత్రమే ముంపునకు గురవుతాయని తేల్చింది. భారీ వరదలు వచ్చినా ప్రభావిత విస్తీర్ణం వంద ఎకరాలకు మించదని అంచనా వేసింది. ఈ అధ్యయనం కోసం ఛత్తీస్‌గఢ్ కోరిన సుమారు రూ.9.88 కోట్లను తెలంగాణ ఏప్రిల్‌లోనే చెల్లించింది. జూలై 30న ఐఐటీ ఖరగ్‌పూర్ తన నివేదికను ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి అందజేసింది. ములుగు జిల్లా తుపాకులగూడెం



వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీ తెలంగాణ సాగునీటి రంగంలో కీలక ప్రాజెక్టుగా మారనుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టీఎంసీలు. ఈ నీటిని కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా పలు జిల్లాల సాగు అవసరాలకు ఉపయోగించాలనేది ప్రభుత్వ ప్రణాళిక. ముఖ్యంగా ఎస్సారెస్పీ రెండో దశ పరిధిలో నాలుగు లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టును స్థిరీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అంటే ఇప్పటికే సాగు చేస్తున్న భూములకు నీటి సరఫరాను మరింత నమ్మకంగా మార్చే అవకాశం ఉంటుంది. మరోవైపు రామప్పపాకాల లింక్ కెనాల్ ద్వారా అదనంగా 30 వేల ఎకరాలకు సాగునీరు అందించాలని భావిస్తోంది. కరువు ప్రభావిత ప్రాంతాలు, వెనుకబడిన మండలాలు, గిరిజన గ్రామాలకు తాగునీటి అవసరాలను తీర్చడంలోనూ ఈ ప్రాజెక్టు ఉపయోగపడనుంది. అయితే ఈ లక్ష్యాలు పూర్తిస్థాయిలో నెరవేరాలంటే బ్యారేజీలో నీటి నిల్వకు అవసరమైన అనుమతులు రావడం అత్యంత కీలకం. సమ్మక్క సాగర్ విషయంలో ఇప్పుడు అందరి దృష్టి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే ఉంది. ఒకవైపు తెలంగాణలో సాగునీటి అవసరాలు పెరుగుతుండగా, మరోవైపు వర్షాభావ పరిస్థితులు భవిష్యత్తులో సవాళ్లు విసిరే అవకాశముంది. ఇలాంటి సమయంలో గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవడం తెలంగాణకు కీలకంగా మారింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రాధాన్యంగా తీసుకోవడానికి ఇదే ప్రధాన కారణం. ఇప్పటికే నిర్మాణం పూర్తికావడం, ముంపు విస్తీర్ణంపై ఐఐటీ ఖరగ్‌పూర్ అధ్యయనం జరగడం, అవసరమైన పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉండటం అనుమతుల ప్రక్రియలో ముఖ్యమైన అంశాలు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చితే ప్రాజెక్టు వినియోగంలో కీలక ముందడుగు పడనుంది. ఎన్వోసీతో పాటు మిగిలిన అనుమతులు కూడా పూర్తయితే లక్షల ఎకరాల ఆయకట్టుకు నీటి భరోసా కల్పించే దిశగా అవకాశం ఏర్పడుతుంది. దీంతో సమ్మక్క సాగర్ భవిష్యత్తును నిర్ణయించే కీలక పరిణామంగా రాయ్‌పూర్ భేటీ నిలవనుంది.

ఓయూలో నాన్ టీచింగ్

కోటి కుటుంబాలకు రూ.5 లక్షల బీమా

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

తెలంగాణలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం మరో కీలక పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా కల్పించాలనే లక్ష్యంతో తీసుకొస్తున్న 'ఇందిరమ్మ బీమా' ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటివరకు అనేక ప్రభుత్వ పథకాల ద్వారా సంక్షేమ ప్రయోజనాలు అందుతున్నప్పటికీ, కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగితే ఆ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. ముఖ్యంగా రోజువారీ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు జీవిత బీమా అనేది ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించాలనే ప్రభుత్వ ఆలోచన ప్రాధాన్యత సంతరించుకుంది. నవంబర్ 19న సిద్దిపేటలో నిర్వహించనున్న బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తును విడుదల చేయనున్నారు. దీంతో ఇందిరమ్మ బీమా అమలుకు సంబంధించి ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తున్నట్లయింది. ఈ పథకంలో ప్రధానంగా కనిపిస్తున్న అంశం ఏమిటంటే.. ఇప్పటికే వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకురావడం. ప్రస్తుతం కొన్ని శాఖల పరిధిలో రూ.2 లక్షల జీవిత బీమా అందుతుండగా, మరికొన్ని పథకాల ద్వారా ప్రమాద బీమా కింద రూ.10 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి. అయితే వేర్వేరు శాఖల్లో వేర్వేరు నిబంధనలతో పథకాలు అమలవుతుండటంతో లబ్ధిదారులకు కొంత గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం సమగ్ర విధానాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం రూ.2 లక్షల జీవిత బీమా పొందుతున్నవారిని కూడా ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకువచ్చి, ఆ మొత్తాన్ని రూ.5 లక్షలకు పెంచాలని సూచించారు. అదే సమయంలో ఇప్పటికే అందుతున్న ప్రమాద బీమా ప్రయోజనాలను మాత్రం తగ్గించకుండా యథాతథంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. అంటే కొత్త పథకం పేరుతో పాత ప్రయోజనాలను తొలగించకుండా, ప్రస్తుతం లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరికీ మరింత భద్రత కల్పించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోంది. ఇక్కడ మరో కీలకమైన విషయం ఏమిటంటే.. ఈ పథకం కేవలం కొత్తగా లబ్ధిదారులను ఎంపిక చేయడానికే పరిమితం కాకుండా, ఇప్పటికే ప్రభుత్వ బీమా భద్రతలో ఉన్నవారిని కూడా కొనసాగించాలనే నిర్ణయం తీసుకోవడం. ముఖ్యంగా ఉపాధి హామీ కూలీలు, నిరుపేద కుటుంబాలు, రోజువారీ ఆదాయంపై ఆధారపడే కార్మికులకు ఈ పథకం ఉపయోగపడే అవకాశం ఉంది. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే, మిగిలిన కుటుంబ సభ్యుల పై అప్పులు, పిల్లల చదువులు, వైద్య ఖర్చులు, రోజువారీ జీవన అవసరాల భారం పడుతుంది. అలాంటి సమయంలో రూ.5 లక్షల జీవిత బీమా సొమ్ము తక్షణ ఆర్థిక సహాయంగా నిలవవచ్చు. అయితే ఈ పథకం విజయవంతం కావాలంటే అర్హత నిబంధనలు, దరఖాస్తు ప్రక్రియ, బీమా క్లెయిమ్ పరిష్కారం వంటి అంశాలు ఎంతో కీలకం. ప్రజలు దరఖాస్తు చేసుకున్న తర్వాత బీమా ప్రయోజనం పొందేందుకు నెలల తరబడి ఎదురు చూడాల్సిన పరిస్థితి రాకూడదు. క్లెయిమ్ ప్రక్రియ సులభంగా, పారదర్శకంగా ఉండాలి. అలాగే అర్హులైన ప్రతి కుటుంబం పథకం పరిధిలోకి వచ్చేలా ప్రభుత్వ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా గ్రామస్థాయిలోనే ఇందిరమ్మ బీమా దరఖాస్తులు అందుబాటులో ఉంచాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించి, పథకంపై ప్రజలకు పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో అర్హులైన కుటుంబాలను గుర్తించడం, దరఖాస్తులు స్వీకరించడం, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేయడం వంటి బాధ్యతలు అధికారులపై ఉండనున్నాయి. కాగితాలపై కోటి కుటుంబాలకు బీమా ప్రకటించడం ఒక ఎత్తయితే, వాస్తవంగా ప్రతి అర్హ కుటుంబానికి ఆ ప్రయోజనం అందించడం మరో ఎత్తు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యులు, వలస కార్మికులు, అసంఘటిత రంగ కార్మికులకు ఈ పథకం గురించి సరైన సమాచారం అందించాలి. దరఖాస్తు సమయంలో అవసరమైన పత్రాలు ఏమిటి, ఎవరు అర్హులు, బీమా ఎప్పటి నుంచి వర్తిస్తుంది, ఏ పరిస్థితుల్లో పరిహారం లభిస్తుంది అనే వివరాలను ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలి. ఈ అంశాల్లో ఎలాంటి గందరగోళం లేకుండా అమలు చేస్తేనే ఇందిరమ్మ బీమా నిజమైన సామాజిక భద్రతా పథకంగా నిలిచే అవకాశం ఉంటుంది. మరోవైపు నవంబర్ 19న సిద్దిపేట సభ నుంచే ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అర్హులైన మహిళలందరికీ చీరలు అందేలా వెంటనే అన్ని జిల్లాలకు వాటిని తరలించాలని అధికారులను ఆదేశించారు. పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం హెచ్చరించడం గమనార్హం. మొత్తంగా చూస్తే నవంబర్ 19న సిద్దిపేట వేదికగా ప్రభుత్వం రెండు కీలక సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లబోతోంది. ఒకవైపు మహిళలకు ఇందిరమ్మ చీరలు, మరోవైపు కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా అందించే ఇందిరమ్మ బీమా. ఈ రెండు కార్యక్రమాలు ప్రభుత్వ సంక్షేమ ప్రాధాన్యతను చాటే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. అయితే వీటి అసలు విజయం ప్రారంభోత్సవాలు, ప్రకటనలతో కాకుండా క్షేత్రస్థాయిలో అమలు ఎలా జరుగుతుంది, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం ఎంత వేగంగా చేరుతుంది అనే అంశాలపైనే ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా బీమా క్లెయిమ్‌లు సకాలంలో పరిష్కారమై, ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా ప్రజలకు భరోసా అందితే ఇందిరమ్మ బీమా తెలంగాణలో పేద కుటుంబాలకు కీలకమైన ఆర్థిక రక్షణగా మారే అవకాశం ఉంది.

మెట్రో విడిచి పీఆర్‌టీఎస్ సాము!

మొదటిపేజీ తరువాయి

సంవత్సరాలైనా మెట్రో విస్తరణ కొలిక్కి రాకపోవడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యామ్నాయాలపై దృష్టిసారించిందా?..ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశంతో లీ అసోసియేట్స్ అధ్యయనంతో రూపొందించిన పీఆర్‌టీఎస్ (పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టం) నివేదికను పరిశీలిస్తే ఇవన్నీ అవుననే సమాధానమే వినిపిస్తుంది.పీఆర్‌టీఎస్‌పై రూపొందించిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌ను సైతం సీఎం సమీక్షించినట్లుగా కొన్నిరోజుల కిందట హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఎంఆర్‌ఎల్) ప్రకటించింది. దీంతో సర్కారు మెట్రో విడిచి పీఆర్‌టీఎస్ సాము చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లుగా అధికారికవర్గాలు చెప్పుకుంటున్నాయి.అయితే ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో రోడ్డుపై ప్రజా రవాణాకంటే వేగం, పర్యావరణహితంలో మెట్రో రైలు ప్రాజెక్టులే మేలంటూ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో ఉన్న మెట్రో విస్తరణ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోలేక అంతకంటే ఎక్కువ వ్యయం, తక్కువ రవాణా సామర్థ్యం ఉన్న పీఆర్‌టీఎస్ వైపు మళ్లినట్లుగా స్పష్టమవుతుంది. ప్రపంచంలోనే రెండో అతి పెద్ద పబ్లిక్‌ప్రైవేటుపార్ట్‌నర్‌షిప్ మెట్రో ప్రాజెక్టుగా ప్రసిద్ధి చెందిన హైదరాబాద్ మెట్రో రైలు పరిస్థితి నానాటికి దయనీయంగా తయారవుతుంది. ఎల్‌అండ్‌టీ కంపెనీ 68 కిలోమీటర్ల మొదటి దశ ప్రాజెక్టును కష్టమైనా.. నష్టమైనా..ఒప్పందం మేరకు ముందుకు తీసుకుపోతుంది. ఈ క్రమంలో మెట్రో విస్తరణపై చాకచక్యంగా వ్యవహరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా అడుగులు వేసింది. ముఖ్యంగా కేసీఆర్ హయాంలో పట్టాలెక్కిన రాయదుర్గం ఎయిర్‌పోర్టు మెట్రోను అర్ధాంతరంగా రద్దు చేయడం మొదలు మెట్రో మొదటి దశ టేకోవర్ వరకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అనాలోచితంగానే దూకుడు ప్రదర్శించిందనే విమర్శలు మొదటి నుంచి ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులు, సర్కారు సంకట స్థితిని చూస్తే ఈ విమర్శలు నిజమనే నిర్ధారణకు రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.




విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు!

మొదటిపేజీ తరువాయి

నాణ్యత పెరగదని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తొందరపాటుతో తీసుకోకూడదని స్పష్టం చేశారు. సంస్కరణల అసలు లక్ష్యం విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించడమే కావాలని కవిత పేర్కొన్నారు. తెలంగాణ విద్యారంగంలో కనిపిస్తున్న రెండు భిన్నమైన పరిస్థితులను కవిత ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒకవైపు పాఠశాలల్లో విద్యార్థులు మధ్యలోనే చదువు మానేయకుండా కొనసాగించడంలో రాష్ట్రం మెరుగైన స్థానంలో ఉందని వివరించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు డ్రాపౌట్ రేటు తక్కువగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ టాప్ ఐదులో ఉందని తెలిపారు. అయితే నాణ్యమైన విద్య అందించే విషయంలో మాత్రం రాష్ట్రం 28వ స్థానంలో ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. విద్యార్థులు బడికి రావడం మాత్రమే విజయానికి కొలమానం కాదని, వారు ఎంత బాగా నేర్చుకుంటున్నారనేది కూడా ముఖ్యమని పేర్కొన్నారు. తరగతి గదుల్లో బోధన ప్రమాణాలు మెరుగుపడాలని, విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యలో నాణ్యత పెంచడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యంగా ఉండాలని స్పష్టం చేశారు. ఇంటర్ బోర్డు రద్దు నిర్ణయాన్ని తాము పూర్తిగా వ్యతిరేకించడం లేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత స్పష్టం చేశారు. అయితే ప్రభుత్వం తీసుకునే నిర్ణయం విద్యార్థులకు నిజంగా ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వ్యవస్థలో లోపాలు ఉంటే వాటిని సరిదిద్దేందుకు మార్గాలు అన్వేషించాలని, అవసరమైతే మార్పులు చేపట్టవచ్చని అభిప్రాయపడ్డారు. కానీ ఎలాంటి చర్చలు లేకుండా ఏకపక్షంగా ఇంటర్ బోర్డును రద్దు చేయాలని ప్రయత్నిస్తే అంగీకరించబోమని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో తీసుకునే ప్రతి నిర్ణయం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉంటుందని గుర్తుచేశారు. అందువల్ల పరిపాలనా సౌలభ్యం కంటే విద్యార్థుల ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం సంస్కరణల పేరుతో తీసుకునే చర్యలకు స్పష్టమైన లక్ష్యం ఉండాలని కవిత పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు రద్దు వంటి కీలక నిర్ణయాల విషయంలో అందరి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలని కవిత డిమాండ్ చేశారు.ముఖ్యంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యారంగ నిపుణులతో ప్రభుత్వం విస్తృతంగా చర్చించాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్య అనేది పాఠశాల చదువులకు, ఉన్నత విద్యకు మధ్య కీలకమైన దశ అని గుర్తుచేశారు. ఈ వ్యవస్థలో మార్పులు చేస్తే విద్యార్థుల చదువులు, పరీక్షల నిర్వహణ, ఫలితాల ప్రకటన వంటి అంశాలపై ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అందుకే సంస్కరణల అమలులో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని హెచ్చరించారు.సంబంధిత వర్గాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర ప్రణాళిక రూపొందించాలని కోరారు. నిర్ణయం తీసుకునే ముందు దానివల్ల కలిగే ప్రయోజనాలు, ఎదురయ్యే ఇబ్బందులపై స్పష్టత ఉండాలని సూచించారు. తెలంగాణ విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురావాలంటే కేవలం పరిపాలనా నిర్ణయాలతో సరిపెట్టకూడదనే అంశాన్ని కవిత ప్రధానంగా ప్రస్తావించారు. విద్యార్థుల సంఖ్య పెరగడం, డ్రాపౌట్ రేటు తగ్గడం సానుకూల పరిణామాలే అయినప్పటికీ చదువులో నాణ్యత వెనుకబడటం తీవ్రమైన సమస్యగా అభివర్ణించారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులకు బలమైన విద్యా పునాది అవసరమని పేర్కొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ



పాల్గొన్న ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి,లక్ష్మి

చౌటుప్పల,విశాల భారతి:

శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో నిత్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా, మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, స్వామి లక్ష్మి దంపతులు అయ్యప్ప భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి మరియు దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ అయ్యప్ప స్వామికి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...

అయ్యప్ప స్వామి దేవాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేయడం ఎంతో ఆనందాన్ని ఇస్తుందని తెలియజేశారు. ప్రజలు ఆధ్యాత్మికతను పెంచుకోవడంలో అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుందని తెలియజేశారు. మానసిక ప్రశాంతత కోసం తాను కూడా అయ్యప్ప దీక్ష తీసుకోవడం జరిగిందని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని దేవాలయ కమిటీకి తెలియజేశారు. ఎంతో మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దేవాలయ కమిటీని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి శేఖర్ రెడ్డి, పబ్బు రాజు గౌడ్ మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయకర్త, చౌటుప్పల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, చౌటుప్పల్ పురపాలక చైర్మన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి,చౌటుప్పల పీఏసీఎస్ చైర్మన్ మస్తాన్ బాబు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు నాయక్, దేవాలయ కమిటీ అధ్యక్షులు దేవరపల్లి గోవర్ధన్ రెడ్డి,దేవాలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షులు బొబ్బిళ్ళ మురళి గురుస్వామి, దేవాలయ కమిటీ మాజీ అధ్యక్షులు భాస్కర్ గురుస్వామి, దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి తూర్పాటి శంకర్ గురుస్వామి, మాజీ ప్రధాన కార్యదర్శి చింతల సాయిలు, మున్సిపల్ పర్సేశివారెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, తాడూరి పరమేశ్, భారత్ అసోసియేషన్ అధ్యక్షులు కంచరకుంట్ల వెంకటరెడ్డి గురుస్వామి, మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సుర్వి నరసింహా గౌడ్, స్థానిక కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, కొసనం రాకేష్ రెడ్డి, పాక చిరంజీవి, ఎండీ హన్ను బాయ్, పస్తాం గంగరాములు, సందగళ్ళ విజయ్ సతీష్ గౌడ్, బొబ్బిళ్ళ రాజేందర్, దీపరాజు, ఉడుగు రమేష్‌గౌడ్, కామిశెట్టి చంద్రశేఖర్ గుప్తా, బిక్షపతి నాయక్, ఉడుగు శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణ గౌడ్, నుక్క సుదర్శన్, కంచరకుంట్ల రామ్ రెడ్డి, తూర్పునూరు నరసింహ గౌడ్, పుష్కుల నాగరాజు గౌడ్, బొడ్డు రాజేందర్ రెడ్డి, బొబ్బిళ్ళ సామ్రాట్, పాశం కృష్ణ, వర్కాల రవి గౌడ్, బండమీది మల్లేష్ తదితర భక్తులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

సంగారెడ్డి జిల్లా నిజాంపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి వెళ్లిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో నేరుగా మాట్లాడిన ఆయన, ధాన్యం అమ్మకాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పేరుకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతుల నుంచి ధాన్యం తీసుకునే ప్రక్రియ మాత్రం ముందుకు సాగడం లేదని మండిపడ్డారు. నెల రోజులుగా ధాన్యం అమ్ముకునేందుకు రైతులు ఎదురుచూస్తున్నారని, చివరకు గత్యంతరం లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకే విక్రయించాల్సి వస్తోందని ఆరోపించారు. పండించిన పంటకు సరైన ధర రాక రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులకు అదనపు ఖర్చులు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. సన్నవడ్లకు బోనస్ ఇస్తామంటూ ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇంకా అమల్లోకి రాలేదని హరీశ్ రావు విమర్శించారు. ఇప్పటివరకు బోనస్ చెల్లింపులకు సంబంధించిన జీవో విడుదల చేయకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.రైతులకు అదనపు ఆదాయం అందిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పుడు ఆ హామీని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. మరోవైపు ధాన్యం కొనుగోళ్లలో తరుగు పేరుతో రైతులను నష్టపరుస్తున్నారని ఆరోపించారు. క్వింటాల్ ధాన్యానికి పది కిలోల వరకు తగ్గిస్తున్నారని, దీనివల్ల రైతులకు రావాల్సిన డబ్బులు భారీగా తగ్గుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ కొనుగోళ్లు సక్రమంగా జరగకపోవడాన్ని అవకాశంగా తీసుకుని దళారులు ధరలను తగ్గిస్తున్నారని విమర్శించారు. సన్నవడ్ల బోనస్‌పై వెంటనే ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అన్ని రకాల ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.రైతులకు ప్రకటించిన ప్రతి హామీని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టాలు భారీగా ఉన్నా రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందడం లేదని హరీశ్ రావు ఆరోపించారు. తెలంగాణలో సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, అయినప్పటికీ బాధిత రైతులకు పరిహారం చెల్లించలేదని విమర్శించారు.కనీసం పంట నష్టాన్ని అంచనా వేసేందుకు అవసరమైన వివరాలను కూడా నమోదు చేయలేదని మండిపడ్డారు.పంట కోసం పెట్టిన పెట్టుబడి చేతికి రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని ఆరోపించారు.వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పంట నష్టం పెద్ద ఆర్థిక భారంగా మారుతుందని వివరించారు. ఇలాంటి సమయంలో ప్రభుత్వ సాయం అందకపోతే తదుపరి పంట సాగుకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతును గుర్తించి పరిహారం అందించేలా తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఇతర రాష్ట్రాలు అందిస్తున్న ఆర్థిక సాయాన్ని ప్రస్తావిస్తూ తెలంగాణ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర, కర్ణాటక ప్రభుత్వాలు రైతులకు ఎకరాకు రూ.5 వేల చొప్పున సాయం అందిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో మాత్రం పంటలు దెబ్బతిన్న రైతులకు ఇప్పటివరకు ఎలాంటి పరిహారం అందించలేదని ఆరోపించారు. గతంలో పదగండ్ల వానల కారణంగా పంటలు నష్టపోయినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం కూడా అదే తరహాలో రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పంట నష్టం తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ప్రతి బాధిత రైతుకు ఎకరాకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలంటే ప్రకటనలకే పరిమితం కాకుండా రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేయాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోళ్లు, పంట నష్ట పరిహారంతో పాటు రైతులకు సంబంధించిన ఇతర పథకాల అమలు పైనా హరీశ్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగు ఖర్చులు పెరుగుతున్న సమయంలో పెట్టుబడి సాయం ఆలస్యమైతే రైతులు అప్పులపై ఆధారపడాల్సి వస్తుందని పేర్కొన్నారు. రైతుబీమా కొత్త విధానంపైనా ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒక కుటుంబంలో ఒక్కరికే ప్రయోజనం కల్పించేలా కాకుండా అర్హత ఉన్న రైతులందరికీ బీమా వర్తింపజేయాలని కోరారు. ఒకే కుటుంబంలో వ్యవసాయం చేసే పలువురు రైతులు ఉన్నప్పుడు అందరికీ సమానంగా ప్రయోజనం అందాల్సిన అవసరం ఉందని వివరించారు.రైతుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం ఆలస్యం చేయకుండా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కొనుగోళ్ల నుంచి బోనస్ చెల్లింపుల వరకు, పంట పరిహారం నుంచి పెట్టుబడి సాయం వరకు పెండింగ్‌లో ఉన్న అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



రూ. 85.06 కోట్లతో రెండు ప్రధాన రహదారుల విస్తరణకు శంకుస్థాపన


విశాలభారతి, గూడూరు:

మంగళవారం గూడూరు మండలంలో ప్రజల రవాణా కష్టాలను తీరుస్తూ, మౌలిక సదుపాయాలను మెరుగుపరిచే దిశగా పలు కీలక అభివృద్ధి పనులకు అట్టహాసంగా ప్రారంభోత్సవం జరిగింది. రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, బలరాం నాయక్, ఎమ్మెల్యే మురళి నాయక్, డీసీసీ (DCC) ప్రెసిడెంట్ డాక్టర్ ఉమా మురళి నాయక్ ఈ కార్యక్రమాల్లో పాల్గొని రోడ్ల విస్తరణ పనులకు పచ్చజెండా ఊపారు. ఈ అభివృద్ధి కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ సునీత కొమ్మలు నాయక్ పాలు ఏర్పాట్లు చేసి ప్రత్యేకతను చాటుకున్నారు. అలాగే మహబూబాబాద్, కేసముద్రం మండలాల మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద ఎత్తున పార్టీ కార్యకర్తలు, నాయకులు మరియు గ్రామ ప్రజలు అత్యుత్సాహంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ రోజు ప్రారంభించిన పనుల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి:

1. నెక్కొండ గూడూరు రోడ్డు విస్తరణ పనులు (వరంగల్ జిల్లా)

పని వివరాలు: నెక్కొండ సూరిపల్లి లింగగిరి గుండెంగ గ్రామాలను కలుపుతూ కి.మీ 10/000 నుండి 19/200 వరకు డబుల్ లైన్ (2L+PS) రోడ్డు విస్తరణ మరియు పటిష్టీకరణ.



రోడ్డు పొడవు: 9.20 కిలోమీటర్లు.

అంచనా వ్యయం: రూ. 30.93 కోట్లు.

లబ్ధి పొందే గ్రామాలు: గూడూరు, అయోధ్యపురం, మదనపూర్, గుండెంగ.

ఇతర పనులు: 11 పైపు కల్వర్టులు, 2 డబుల్ పైపు కల్వర్టులు, 3 మైనర్ బ్రిడ్జిలు, కి.మీ 8/02 వద్ద ఒక హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం.

2. గూడూరు - కేసముద్రం రోడ్డు విస్తరణ పనులు (మహబూబాబాద్ జిల్లా)

పని వివరాలు: గూడూరు నుండి కేసముద్రం వరకు కి.మీ 0/0 నుండి 16/100 వరకు డబుల్ లైన్ (2L+PS) రోడ్డు విస్తరణ మరియు పటిష్టీకరణ.

రోడ్డు పొడవు: 16.10 కిలోమీటర్లు.

అంచనా వ్యయం: రూ. 54.13 కోట్లు.

లబ్ధి పొందే గ్రామాలు: గూడూరు, వడ్డెరగుడెం, బొల్లెపల్లి ఎస్సీ కాలనీ, బొల్లెపల్లి, బంచరాయ్ తండా, నాయక్ పల్లి, బాల్యానాయక్ తండా, తీగలవేణి, అర్పణ పల్లి, ఉప్పరపల్లి, మరియు కేసముద్రం స్టేషన్.

ఇతర పనులు: 6 పైపు కల్వర్టులు, కి.మీ 1/68 మరియు 6/02 వద్ద స్లాబ్ కల్వర్టుల నిర్మాణం.

మొత్తం రూ. 85.06 కోట్ల భారీ వ్యయంతో ఈ రెండు ప్రధాన రోడ్ల విస్తరణ పనులు జరగనున్నాయి. ఈ రహదారుల నిర్మాణం పూర్తయితే గూడూరు మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు, రైతులకు రవాణా పరంగా ఎంతో సౌలభ్యం కలగనుందని నేతలు మరియు అధికారులు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

##

విద్యార్థులలో దాగిన కళా ప్రతిభకు పదును

- చిత్రలేఖన పోటీలతో సృజనాత్మకతకు ప్రోత్సాహం
- స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఎస్‌బీఐ లైఫ్ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతుల ప్రదానం.




మహబూబాబాద్ జిల్లా విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్; విద్యార్థులలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీసి, వారి కళాత్మక ప్రతిభకు తగిన గుర్తింపు కల్పించడమే లక్ష్యంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీలు ఆకట్టుకున్నాయి. మహబూబాబాద్ పట్టణంలోని స్వస్తిక్ కాన్సెప్ట్ స్కూల్‌లో ఎస్‌బీఐ లైఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చదువుతోపాటు విద్యార్థుల్లో సృజనాత్మకత, కళాత్మక అభిరుచి, స్వతంత్ర ఆలోచనా విధానాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పేర్కొంది. చిత్ర లేఖనం వంటి పోటీలు చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా, తమ ఆలోచనలను రంగుల రూపంలో వ్యక్తీకరించే అవకాశాన్ని కల్పిస్తాయని తెలిపింది. పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా కళలు, సాంస్కృతిక, సృజనాత్మక రంగాల్లోనూ తమదైన ముద్ర వేయాలని సూచించారు. చిన్న తనం నుంచే ఇలాంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భవిష్యత్తులో విభిన్న రంగాల్లో రాణించేందుకు పునాది పడుతుందని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించే లక్ష్యంతో కార్యక్రమాన్ని నిర్వహించిన ఎస్‌బీఐ లైఫ్ ప్రతినిధులను పాఠశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ లైఫ్ ప్రతినిధులు కుమార్, యాదగిరి, సుమన్, పాఠశాల చైర్మన్ కె. చంద్రమౌళి, ప్రిన్సిపాల్ మధు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపింది.

ఆదివాసీ యువకుని హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి

- లాడ్జి యాజమాన్యం పై SC,ST అట్రాసిటీ కేసు నమోదు చెయ్యాలి
- బాధితులని కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం చెల్లించాలి
- ఆదివాసీ నవ నిర్మాణ సేన నాయకులు ఎట్టి విద్యాసాగర్



వాజేడు , విశాలభారతి: భద్రాచలంలోనీ ఓ ప్రైవేటు లాడ్జిలో రూమ్ కోసం వెళ్లిన ఆదివాసీ యువకులపై అతి కిరాతకంగా దాడికి పాల్పడి దారుణంగా హత్య చేసిన లాడ్జి యాజమాన్యం పై ఎస్ సీ, ఎస్ టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఏ ఎన్ ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విగ్గి , జోమాటోలో పనిచేస్తున్న ఆదివాసీ యువకులు తెల్లం శరత్, కుర్సం ప్రశాంత్, కీసర కార్తీక్ లు భద్రాచలం రామాలయం సమీపంలోని ఓ ప్రైవేటు లాడ్జిలో రూమ్ కోసం వచ్చిన ఆదివాసీ యువకులైన తెల్లం శరత్, కుర్సం ప్రశాంత్, కీసర కార్తీక్ ల పై లాడ్జి యాజమాన్యం వాగ్వాదానికి దిగి యువకులను తీవ్రంగా కొట్టడంతో ఆ ఘటనలో తెల్లం శరత్ (24) అనే యువకుడు అక్కడికక్కడే మృతిచెందడం జరిగింది. ఆదివాసీ యువకులపై దాడి చేసి హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవలని ,మరియు లాడ్జి లైసెన్స్ పూర్తిగా రద్దు చేసి మృతుని కుటుంబానికి లాడ్జి యాజమాన్యం 50 లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆదివాసీ నవ నిర్మాణ సేన ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎస్ రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్, మండల కార్యదర్శి, కోరం మనోజ్, ఏ ఎన్ ఎస్ నాయకులు పీర్ల రవిరాజు, రాంబాబు, పాయం ఆంజనేయులు, గొంది శోభన్ బాబు, మడకం ప్రకాశ్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని కల్పించాలి

- రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించాలి – ఊడుగుల లింగన్న డిమాండ్




దంతాలపల్లి విశాల భారతి: ఉపాధి హామీ కార్మికులకు ఏడాదికి 200 రోజుల పని కల్పించి, రోజుకు రూ.600 కనీస వేతనం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న డిమాండ్ చేశారు. దంతాలపల్లి మండలం రేకుతండా గ్రామపంచాయతీ పరిధిలోని ఉపాధి హామీ పనులను ఆయన సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సగటు వేతనాలు తక్కువగా వస్తున్నాయని, కూలీ డబ్బులు సకాలంలో చెల్లించడం లేదని, అందరికీ పని కల్పించడం లేదని కార్మికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ జిల్లాలో తక్కువ వర్షపాతం కారణంగా వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిందని, ఉపాధి అవకాశాలు లేక గ్రామీణ ప్రజలు పట్టణాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కార్మికులకు 200 రోజుల పని, రూ.600 కనీస వేతనం కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరారు.మహబూబాబాద్ జిల్లాను కరువు ప్రాంతంగా గుర్తించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ కార్పొరేట్ సంస్థలకు లాభాలు చేకూర్చే విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలను కార్మికులంతా ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.1,000 చొప్పున మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సర్వం, బిఖు, బద్రు, రాములు, జగన్, బుజ్జి, యాకమ్మ, అచ్చమ్మ, జ్యోతి, సంధ్య, శైలమ్మ, సురేష్, వెంకన్న, సోమ్లా, మౌనిక, బద్రి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యాలయంలో విద్యార్థినులకు శానిటరీ కిట్ల పంపిణీ


- బాలికల ఆరోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

దేవరుప్పుల విశాలభారతి: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మంగళవారం ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ తెలుగు అసోసియేషన్ (వెటా), విక్కీస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థినులకు శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, వెటా వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రుతుక్రమ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంత బాలికల ఆరోగ్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, వెటా ప్రతినిధులు, విక్కీస్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభుత్వాలున్నది పెట్టుబడిదారుల కోసం కాదు, పేదల కోసమే

- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



చౌటుప్పల,విశాల భారతి: ప్రభుత్వాలున్నది పెట్టుబడిదారులు, కాంట్రాక్టర్ల కోసం కాదని, పేదల కోసమేనని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల మండలం దామెరలోని బాలాజీ ఫంక్షన్ హాల్లో నూతన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సి నెల్లికంటి సత్యంతో కలిసి పాల్గొన్నారు. చౌటుప్పల మండలం, మున్సిపాలిటీ, నారాయణపూర్ మండలాలలో చేయూత పింఛన్ కి ఎంపికైన 2418 మంది లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ఈ పత్రాలు అందుకున్న వారిలో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, గీత, చేనేత కార్మికులు ఉన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "వేయికళ్లతో ఎన్నో ఏండ్లుగా ఎదురుచూస్తున్న శుభదినం నేడు వచ్చింది. 10 సంవత్సరాల క్రితం ఎప్పుడో పెన్షన్లు ఇచ్చారని, ఆ తర్వాత కొత్త పింఛన్లు రాలేదన్నారు. వేల మంది తల్లులు ఎదురుచూసిన క్షణం ఇది" అని పేర్కొన్నారు. "కేవలం మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా కొన్ని పింఛన్లు వచ్చాయన్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగులు, చేనేత, గీత కార్మికులకు పెన్షన్ ఇవ్వడం చాలా మంచి నిర్ణయం. వీరితోపాటు వృద్ధులకు కూడా ఇస్తే బాగుండేది" అని అన్నారు.వృద్ధాప్య పెన్షన్లను కూడా ప్రభుత్వం త్వరలోనే ఇవ్వాలని కోరుతున్నానని, ప్రభుత్వం ఈ విషయంలో కట్టుబడి ఉందని, వృద్ధాప్య పెన్షన్ల విషయం ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.రాబోయే కాలంలో వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని, పెన్షన్ పెంచే విషయంలో ప్రభుత్వం ఆలోచన చేయాలని తన తరపున కోరుతున్నానని తెలిపారు. ఈ ప్రభుత్వం పని చేయాల్సింది పేదల కోసం, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేద వాళ్లకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉందని గుర్తు చేశారు."తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది త్యాగాల పునాదుల మీద కానీ, అనుకున్న స్థాయిలో పేదవాళ్లకు న్యాయం జరగలేదన్న ఆలోచనలో ప్రజలు ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ" అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ సీఈవో శోభారాణి, ఆర్డీవో శేఖర్ రెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని, కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్, నారాయణపూర్, చౌటుప్పల్ మండలాల ఎంపీడీవో ప్రమోద్ కుమార్, ఇతర అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు, సెక్రటరీలు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ దొంగ హామీలకు నేటితో మూడేళ్లు

- ప్రజలకు మిగిలింది శూన్యహస్తమే!
- రైతుల సమస్యలపై తీవ్ర విమర్శ
- మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి



చౌటుప్పల్, విశాలభారతి:

కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాయమాటల హామీలకు నేటితో మూడేళ్లు పూర్తయ్యాయని, ఆరు గ్యారెంటీలు, 420 హామీల పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. అభయహస్తం పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 నవంబర్ 17న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌తో సమానమని ప్రకటించిన కాంగ్రెస్ నాయకులు, అందులో ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా అమలు చేస్తామని ప్రజలకు మాట ఇచ్చారని గుర్తుచేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మూడేళ్లు గడుస్తున్నా అనేక హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. 62 ప్రధాన అంశాలతో 42 పేజీల్లో రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతులకు ప్రతి ఏటా ఎకరానికి రూ.15 వేల పెట్టుబడి సాయం, కౌలు రైతులకు ఆర్థిక సహాయం, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు క్వింటాలుకు రూ.500 బోనస్, తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు, మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. కానీ వాటిలో అనేక హామీలు నేటికీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోలేదని విమర్శించారు. గొప్పగా ప్రచారం చేసుకున్న అభయహస్తం నేడు శూన్యహస్తంగా మారిందని ఎద్దేవా చేశారు. తొలి క్యాబినెట్ సమావేశంలోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పటివరకు 38 క్యాబినెట్ సమావేశాలు జరిగినా ఆ హామీని ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. గాంధీభవన్ సాక్షిగా తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాటను ఎందుకు నిలబెట్టుకోలేకపోయారో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ శ్రీధర్ బాబు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు పెట్టుబడి సాయం, రూ.2 లక్షల రుణమాఫీ, పంట నష్టపరిహారం, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్ వంటి హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రైతులు ఆరు నెలల పాటు కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. పంట చేతికొచ్చి దాదాపు నెల రోజులు గడుస్తున్నా రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ కొనుగోళ్ల కోసం ఎదురుచూస్తున్నారని, ఇప్పటివరకు ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు.రైతుల సమస్యలను పట్టించుకోవాల్సిన మునుగోడు నియోజకవర్గ అధికార పార్టీ ఎమ్మెల్యేకు మంత్రి పదవిపై ఉన్న శ్రద్ధ రైతుల సమస్యలపై లేదని విమర్శించారు.

విద్యార్థుల సమస్యలపై కదిలిన యంత్రాంగం!



- కంబాలపల్లి పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్ అనిల్ కుమార్
- ఐదు తరగతులకు ఒకే గది.. విద్యార్థుల అవస్థలపై ఆరా
- నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణానికి హామీ
- శిథిల భవనాల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని వెల్లడి

మహబూబాబాద్ జిల్లా

విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్

ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కరువై విద్యార్థులు చదువుల కోసం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. మహబూబాబాద్ మండలం కంబాలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలను జిల్లా అదనపు కలెక్టర్ అనిల్ కుమార్ మంగళవారం స్వయంగా పరిశీలించారు. ప్రత్యేక ప్రజావాణిలో విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు పాఠశాలను సందర్శించి అక్కడి వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో తెలుసుకున్నారు. పాఠశాలలో ఐదు తరగతులకు చెందిన విద్యార్థులు కేవలం ఒకే ఒక్క గదిలో చదువుకోవాల్సిన దుస్థితిని చూసి పరిస్థితిని సమీక్షించారు. మరోవైపు నాలుగు తరగతి గదులతో కూడిన పాత భవన సముదాయం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారడాన్ని గుర్తించారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేకపోవడం, శిథిల భవనాల మధ్య విద్యాభ్యాసం కొనసాగించాల్సి రావడం వంటి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తానని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారు. శిథిలావస్థకు చేరిన పాత భవనాలను పాఠశాల సెలవుల సమయంలో తొలగించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. అనంతరం విద్యార్థులతో మమేకమై వారి చదువులు, పాఠశాలలో ఎదురవుతున్న ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన విద్యార్థుల విజ్ఞప్తికి స్పందించి జిల్లా అదనపు కలెక్టర్ స్వయంగా పాఠశాలకు రావడం, సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

హామీల అమలుపైనే ఆశలు!

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆటంకంగా మారకూడదని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఐదు తరగతులకు ఒకే గది అనే దుస్థితికి ముగింపు పలికి, నాలుగు అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టాలని కోరుతున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న పాత భవనాలను తొలగించి విద్యార్థులకు సురక్షితమైన వాతావరణం కల్పించాలని ఆశిస్తున్నారు. అధికారుల హామీలు కాగితాలకే పరిమితం కాకుండా పనుల రూపంలో కనిపించాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఏసీజీఈ మండల శ్రీరాములు, టీపీ జేవీసీ బాధ్యులు మైస శ్రీనివాసులు, పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కె. గిరిజ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గుగులోత్ లక్ష్మి, పేరెంట్స్ కమిటీ ప్రతినిధి కంబాలపల్లి సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తానంచర్ల ఆనకట్ట పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి

- సాగునీటి కష్టాలు తీర్చాలని ఎంపీ బలరాం నాయక్‌కు సీపీఎం నేతల వినతి



మరిపెడ విశాల భారతి: మండలంలోని తానంచర్ల గ్రామ సమీపంలో ఉన్న ఆనకట్ట నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని సీపీఎం మరిపెడ మండల ప్రతినిధి బృందం కాంగ్రెస్ ఎంపీ బలరాం నాయక్‌ను కోరింది. ఈ మేరకు ఎంపీకి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గుండగాని మధుసూదన్ మాట్లాడుతూ.. ఆనకట్టకు కుడి, ఎడమ కాలువలు నిర్మిస్తే మరిపెడ మండలంతో పాటు సూర్యాపేట జిల్లా నూతనకల్, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలాల పరిధిలోని పలు గ్రామాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొని రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ ప్రాంత రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఆనకట్ట పనులు త్వరగా చేపట్టి, సకాలంలో సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షుడు తాడూరి వీరేంకులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాణాల రాజన్న, రైతు సంఘం మండల ఉపాధ్యక్షుడు తాటికొండ అనంతచారి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

- రూ.31.03 లక్షల విలువైన చెక్కులు అందజేత: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



దేవరుప్పుల విశాలభారతి : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 31 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన రూ.31,03,596 విలువైన చెక్కులను పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు ఆడపిల్లల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపూరి నరేందర్ కుటుంబానికి అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్ రామచంద్ర నాయక్ భరోసా



డోర్నకల్ విశాల భారతి: మున్సిపాలిటీ కేంద్రంలోని ఏపూరి నరేందర్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా మాఫియాపై ఎక్సైజ్ దాడులు.. అక్రమ తయారీకి చెక్!

- గార్ల మండలంలో అధికారుల మెరుపు దాడులు
- మహిళ వద్ద 4 లీటర్ల నాటుసారా స్వాధీనం.. 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నిందితురాలిపై కేసు నమోదు.. ఎమ్మార్వో ఎదుట బైండోవర్
- అక్రమ తయారీ, విక్రయాలపై కఠిన చర్యలు తప్పవు: ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్



గార్ల విశాల భారతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్: గ్రామీణ ప్రాంతాల్లో నాటుసారా తయారీ, అక్రమ విక్రయాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలంలోని అంజనాపురం, పెద్దకిష్టాపురం గ్రామాల్లో నిర్వహించిన తనిఖీల్లో నాటుసారా అక్రమ కార్యకలాపాలు బయటపడ్డాయి. ఈ దాడుల్లో గుగులోత్ శాంతి అనే మహిళ వద్ద నాలుగు లీటర్ల నాటుసారా పట్టుబడగా, అధికారులు దానిని స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు. అంజనాపురం గ్రామంలో నాటుసారా తయారీకి సిద్ధం చేసిన సుమారు 800 లీటర్ల బెల్లం పానకాన్ని గుర్తించిన ఎక్సైజ్ సిబ్బంది అక్కడికక్కడే ధ్వంసం చేశారు. నాటుసారా తయారీ వెనుక ఉన్న అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పట్టుబడిన మహిళను గార్ల ఎమ్మార్వో ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ మాట్లాడుతూ.. నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణాకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడే అక్రమ వ్యాపారాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వబోమని స్పష్టం చేశారు. గ్రామాల్లో ఎక్కడైనా నాటుసారా తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, కానిస్టేబుళ్లు నాగరాజు, విజయ్, జూన్ పాషా, గోపి పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ భీమా ఏర్పాటు అభినందనీయం

- 5 లక్షల పరిహారాన్ని 10 లక్షలకు పెంచాలి
- ఆరోగ్యశ్రీలో అన్ని రకాల వ్యాధులకు వైద్యం అందించాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టిపల్లి సైదులు

మోతె నవంబర్ 17 విశాల భారతి



రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ భీమా పథకాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, అయితే ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో సామాన్య, పేద, మధ్యతర గతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలంటే ఈ పథకం కింద అందించే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో కుటుంబ పెద్దను కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా పూర్తిగా కుప్పకూలిపోయే పరిస్థితి ఉందన్నారు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి మరణిస్తే పిల్లల చదువులు, కుటుంబ జీవనం, అప్పుల భారం అన్నీ ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించే ఆర్థిక సాయం కేవలం తాత్కాలిక ఉపశమనంగా కాకుండా, ఆ కుటుంబం తిరిగి నిలబడేందుకు ఉపయోగపడేలా ఉండాలని పేర్కొన్నారు.

పేదల ప్రాణాలకు విలువ లేదా?

మరోవైపు ఆరోగ్యశ్రీ పథకంలో అన్ని రకాల వ్యాధులకు ఉచిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. అనారోగ్యం వచ్చినప్పుడు పేదలు అప్పులు చేసి, ఆస్తులు అమ్ముకుని ప్రైవేటు ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వైద్యం ఖర్చులు భరించలేక అనేక కుటుంబాలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాయని, మరికొందరు సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆరోగ్యం అనేది సంపన్నులకే పరిమితమైన హక్కు కాదని, ప్రతి పేదవాడికి నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ఆరోగ్యశ్రీలో వ్యాధుల పరిమితులు, ప్యాకేజీల పేరుతో పేదలకు వైద్యం నిరాకరించే పరిస్థితులకు ముగింపు పలకాలని కోరారు. అవసరమైన అన్ని రకాల వ్యాధులకు, శస్త్రచికిత్సలకు హుర్తిస్థాయిలో నగదు రహిత వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం సంక్షేమ పథకాల ప్రకటనలకే పరిమితం కాకుండా వాటి ప్రయోజనాలు అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ కుటుంబ భీమా పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచడంతోపాటు ఆరోగ్యశ్రీని మరింత విస్తరించి, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని మట్టిపల్లి సైదులు కోరారు.

నూతన చేయూత పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ వచ్చేలా తన వంతు కృషి చేస్తా
- సుర్వి మల్లేష్ గౌడ్ సర్పంచ్, ఫోరమ్ మండల అధ్యక్షులు



చౌటుప్పల,విశాల భారతి: ప్రభుత్వ సంక్షేమ పథకాలలో భాగంగా చౌటుప్పల మండలం దామెర గ్రామ పరిధిలోని బాలాజీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం నూతన చేయూత పింఛన్ లబ్ధిదారులకు పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మునుగోడు శాసనసభ్యులు,నెలకంటి సత్యం శాసనమండలి సభ్యులు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో శోభారాణి,చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, ఆర్డీవో, ఎంఆర్వో,ఎంపీడీవో,మున్సిపల్ కమిషనర్,నారాయణపురం, చౌటుప్పల్ మండల స్థాయి అధికారులు, రెండు మండలాల సర్పంచులు, చౌటుప్పల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంకిరెడ్డిగూడెం గ్రామంలో 44 మందికి పింఛన్లు:

అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీకి చెందిన గీత కార్మికులు, చేనేత కార్మికులు, వితంతువులు, వికలాంగులు సుమారు 54 మంది దరఖాస్తు చేసుకోగా, ప్రస్తుతం 44 మంది లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను సర్పంచ్, ఫోరమ్ చౌటుప్పల్ మండల అధ్యక్షులు సుర్వి మల్లేష్ గౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇప్పించుటకు తన వంతు కృషి చేస్తానని తెలియజేశారు. మిగిలిన వారికి కూడా త్వరలోనే పింఛన్లు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంగాపురం పాండు గౌడ్ పంచాయతీ కార్యదర్శి, శివాజీ కారోబార్, చేయూత పింఛన్ లబ్ధిదారులు, గ్రామ మహిళలు, పెద్దలు, వివిధ పార్టీల రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మైత్రీశ్రీపురంలో డ్రైనేజీ పనులు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో 450 మీటర్ల డ్రైనేజీ లైన్ నిర్మాణం



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మైత్రీశ్రీపురం కాలనీలో 450 మీటర్ల పొడవున వన్ ఫీట్ డ్రైనేజీ లైన్ నిర్మాణ పనులు చేపట్టినట్లు పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధెంకి కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పనులను ఆయన స్థానిక నాయకులు, కాలనీ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సిద్ధెంకి కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, కాలనీ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను నాణ్యతతో పూర్తి చేసేలా పర్యవేక్షిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బొర్ర సురేష్, వడ్డేపల్లి విజయేందర్ రెడ్డి, పసుల రాజేందర్, చెరుకూరి జగన్, నాగార్జున, వనం చంద్రశేఖర్, కాలనీ అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ రోబోటిక్స్ లీగ్ లో పీఎం శ్రీ నంది వనపర్తి విద్యార్థులు విజయం

- హైదరాబాద్ రీజియన్ స్థాయి పోటీలో ప్రథమ ద్వితీయ బహుమతులు కైవసం.
- విద్యార్థులకు ఉపాధ్యాయ బృందం పలువురు అభినందనలు



విశాల భారతి ఇబ్రహీంపట్నం: జాతీయ రోబోటిక్స్ లీగ్‌లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి విద్యార్థుల విజయం సాధించారు. హైదరాబాద్ రీజియన్ స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం హైదరాబాద్ రీజియన్ స్థాయిలో నిర్వహించిన నేషనల్ రోబోటిక్స్ లీగ్ (National Robotics League) పోటీల్లో పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ నందివనపర్తి పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ బహుమతులను సాధించారు.అమెజాన్ (Amazon) సంస్థ సహకారంతో విద్యార్థులు ఈ ప్రతిష్టాత్మక రోబోటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధి నుంచి మొత్తం 27 జట్లు పోటీల్లో పాల్గొనగా, నందివనపర్తి పాఠశాలకు చెందిన రెండు జట్లు తమ సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యంతో అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బహుమతులను కైవసం చేసుకున్నాయి. విద్యార్థుల్లో రోబోటిక్స్, సైన్స్, టెక్నాలజీ పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు, నూతన ఆవిష్కరణలు సమస్య పరిష్కార నైపుణ్యాలను ప్రోత్సహించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహించారు. అమెజాన్ సంస్థ అందించిన సహకారం విద్యార్థులకు సాంకేతిక రంగంలో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి అవకాశాన్ని కల్పించింది. ఈ విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. విద్యార్థులు తమ ప్రతిభతో పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హైదరాబాద్ రీజియన్ స్థాయిలో విజయం సాధించిన ఈ రెండు జట్లు త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో (National Level) పాల్గొననున్నాయి. జాతీయ స్థాయిలో కూడా విజయాలు సాధించి పాఠశాలకు, ప్రాంతానికి మరింత మంచి పేరు తీసుకురావాలని పాఠశాల ఉపాధ్యాయులు ఆకాంక్షించారు.

టైగర్ నరసింహ మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- మృతుడి కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్

విశాల భారతి, ఎల్ బినగర్: గొల్లూరు కాంగ్రెస్ పార్టీ నాయకుడు, టైగర్ నరసింహ మృతి మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని డాక్టర్స్ కాలనీ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ అన్నారు. టైగర్ నరసింహ మృతి వార్త తెలిసి ఆయన నివాసానికి చేరుకున్న ధన్‌రాజ్ గౌడ్, మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నల్లెంకి ధన్‌రాజ్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కోసం టైగర్ నరసింహ చేసిన సేవలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధం ఎప్పటికీ గుర్తుండిపోతాయని అన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని పేర్కొంటూ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఘనంగా స్పేస్ అండ్ ప్లానిటోరియం షో

- అంతరిక్ష అద్భుతాలను వీక్షించిన విద్యార్థులు



పాల్వంచ విశాల భారతి: స్థానిక మున్సిపల్ పరిధిలోని స్టార్ చిల్డ్రన్ హైస్కూల్ లో అంతరిక్ష విజ్ఞానం నకు సంబంధించిన స్పేస్ గెలాక్సీ అండ్ ప్లానెటోరియం షో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు సౌర కుటుంబం గ్రహాలు ఉపగ్రహాలు నక్షత్రాలు ఆస్టరాయిడ్స్‌కు సంబంధించిన విషయాలతో పాటు గ్రహాల కదలికలు సౌర వ్యవస్థ పనితీరు ప్రాచీన కాలం నాటి డైనోసార్ల ఆవిర్భావం జీవన విధానం భూమిపై జీవ పరిణామ క్రమం గురించి ఆసక్తిగా తెలుసుకున్నారు. విజ్ఞానం మరియు వినోదంతో కూడిన ఈ వినూత్న ప్రదర్శన విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పరిశోధనా ఆసక్తిని పెంపొందించినది. అనంతరం ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ప్రోగ్రాం ఆర్గనైజింగ్ ఇన్‌చార్జి సోమా కిరణ్ కుమార్ రెడ్డిని పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సహకారంతో బుగ్గ జాతర సౌకర్యాలకు రూ. 45 లక్షల నిధులు మంజూరు

- చురుగ్గా కొనసాగుతున్న జాతర ఏర్పాట్లు
- బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ అనంగల్ల యాదయ్య
- సిసి రోడ్డు అతిథిగృహ నిర్మాణ ఏర్పాట్లను పరిశీలించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

విశాల భారతి ఇబ్రహీంపట్నం : ఈనెల 24 నుండి ప్రారంభం అయ్యే ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర బుగ్గ జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సహకారంతో దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు ఆరుట్ల మాజీ సర్పంచ్ బుగ్గరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ అనంగల్ల యాదయ్య అన్నారు. మంగళవారం ఆరుట్ల గ్రామంలో బుగ్గజాతర సందర్భంగా రూ.20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డును ఆలయం వద్ద రూ. 25లక్షలతో నిర్మిస్తున్న అతిథి గృహ నిర్మాణ పనులను దేవాలయ కమిటీ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు ఈకార్యక్రమంలో ఆరుట్ల వార్డు సభ్యులు ఎండి ఇమ్రాన్ దేవాలయ కమిటీ సభ్యులు వెదిరే రమణారెడ్డి మానిపాటి వెంకటేష్ ఎన్నిదుల సురేష్ ఇందిరమ్మ కమిటీ సభ్యులు చెరుకు నర్సింహా బుట్టి కృష్ణ కంబాలపల్లి బుగ్గరాములు కోరే బాబు ఆరుట్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చిందం శ్రీశైలం నాయకులు మార సురేష్ మాదగోని జంగయ్య గౌడ్ భాస్కర్ రైనా ఎండి అశ్రఫ్ ఆడెపు మధు లొంగారి భాస్కర్ కాసుల ఆంజనేయులు దూసరి రాజు పంబాల టిల్లు ప్రజాగలం భూపాల్ తదితరులు పాల్గొన్నారు

చెత్త డంపింగ్ యార్డ్ గ్రీన్ పవర్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లో రానివ్వం



- 700 టన్నుల చెత్తను తీసుకొచ్చి చెత్త ప్రాంతంగా మార్చొద్దు
- పవర్ గ్రిడ్ ప్రాజెక్టుతో ప్రజల జీవితాలను నాశనం చేయొద్దు
- బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్

విశాల భారతి ఇబ్రహీంపట్నం

పవర్ గ్రిడ్ ప్రాజెక్టుతో ప్రజల జీవితాలను నాశనం చేయొద్దని అన్నారు. బిఆర్ఎస్ పార్టీ యాచారం మండల అధ్యక్షులు కర్నాటి రమేష్ గౌడ్ మండల కేంద్రంలోని సాయి శరణం గార్డెన్ లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం శ్రీ వెంకటేశ్వర పవర్ గ్రేడ్ ప్రాజెక్టు పేరుతో యాచారం రెవెన్యూ పరిధిలో ఏర్పాటు చేయదలచుకున్న పవర్ గ్రిడ్ ప్రాజెక్టును తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే స్పందించకపోవడం హాస్యాస్పదమని అన్నారు. ప్రజలందరూ ప్రభుత్వ కుట్రను తిప్పి కొట్టాలి. హైదరాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని సుమారు 700 టన్నుల చెత్తను తీసుకొచ్చి ఈ ప్రాంతాన్ని కాలుష్య ప్రాంతంగా తయారుచేసి ఈ ప్రాంత ప్రజల జీవితాలతో చెలగాటమాడాలని చూస్తున్నారు. మండల వ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసి, ఉద్యమిస్తామన్నారు. ఒకవైపు ఫ్యూచర్ సిటీ పేరుతో ప్రభుత్వం దోచుకుంటుంటే మరోవైపు పవర్ గ్రిడ్ ప్రాజెక్టుతో ప్రజల జీవితాలు నాశనం చేయాలని చూస్తున్నారు. ఎట్టి పరిస్థితులలో ఈ ప్రాంతానికి ఈ పవర్ గ్రిడ్ ప్రాజెక్టును రానివ్వమని త్వరలోనే గులాబీ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ముఖ్యంగా పార్టీలకు అతీతంగా వ్యతిరేకించాలని ఈ అంశంపై అన్ని పార్టీల నాయకులు కలిసి రావాలని ఈ ప్రాంతాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని తొందరలోనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఉద్యమించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పచ్చ భాష పిఏసిఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్ రెడ్డి, నంది వనపర్తి మాజీ సర్పంచ్ రాజు నాయక్, ఓరుగంటి యాదయ్య గౌడ్, బండి మీద కృష్ణ, కాజు భాయ్, జానీ, బొల్లంపల్లి వెంకటేష్, షమీం, సాయి, భీమ్, అయ్యవారు గూడ సర్పంచ్ నక్క అలివేలు వెంకటేష్, వివిధ గ్రామాల సర్పంచులు మాజీ సర్పంచ్లు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్త పెన్షన్లతో పేదలకు ఆర్థిక భరోసా

- సర్పంచ్ బానోతు బద్రు నాయక్

మరిపెడ విశాల భారతి: గ్రామానికి చెందిన నూతన పెన్షన్ లబ్ధిదారులకు సర్పంచ్ బానోతు బద్రు నాయక్ పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం సంతోషకరమని, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఆర్థికంగా అండగా నిలుస్తాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పెన్షన్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



క్లీన్ రైస్ స్ట్రింగ్ బయో ప్రైవేట్ సహకారంతో కృషి విజ్ఞాన కేంద్రం రైతులకు ప్రత్యేక సమావేశం

- ప్రకృతి వ్యవసాయ సాగుపై రైతులకు అవగాహన
- జీవామృతం తయారీ విధానంపై ప్రత్యేక శిక్షణ



బూర్గంపాడు / విశాల భారతి; రైతులు ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను అలవర్చుకొని అధిక దిగుబడులతో పాటు తక్కువ పెట్టుబడితో మెరుగైన లాభాలు పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం, క్లీన్ రైస్ బెంగళూరు సంస్థల ప్రతినిధులు సూచించారు. బూర్గంపాడు మండలానికి చెందిన ఉత్తమ రైతు గాదె నర్సిరెడ్డి పొలంలో రైతుల సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతుల్లో పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ముఖ్యంగా జీవామృతం తయారీ విధానంపై ప్రత్యేక అవగాహన కల్పించారు. జీవామృతం తయారీకి అవసరమైన పదార్థాలు, వాటి మోతాదులు, తయారుచేసే పద్ధతి, పంటలకు వినియోగించే విధానాన్ని క్షేత్రస్థాయిలో వివరించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారాన్ని పెంపొందించడంతో పాటు సాగు ఖర్చులను తగ్గించుకోవచ్చని, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను సాధించవచ్చని తెలిపారు. రైతులు సంప్రదాయ ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఆసక్తి పెంచుకొని వాటిని తమ పొలాల్లో అమలు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలోక్లీన్ రైస్‌స్ట్రింగ్ బయో ప్రతినిధి శ్రీనివాస్, కృషి విజ్ఞాన కేంద్రం భరత్, ఏడీఏ తాతారావు, బూర్గంపాడు ఏవో శంకర్, ఉత్తమ రైతు గాదె నర్సిరెడ్డి, రైతు పాపారావు, సుబ్బారెడ్డి మహిళా రైతు ప్రశాంతి హేమచంద్రపురం, పుష్ప వెంకటాపురం, హంస మొరంపల్లి మంజర తదితర రైతులు అధిక సంఖ్యలోపాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో రాజగోపాల్ రెడ్డి కోసం ప్రత్యేక ప్రార్థనలు, 111 కేజీల జిలేబీ పంపిణీ



చౌటుప్పల్,విశాల భారతి: రాబోయే ఎన్నికల్లో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ, ఆయన అభిమాని, మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ సిరాజుద్దీన్ దేశంలోని పవిత్ర స్థానమైన అజ్మీర్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో ప్రత్యేకంగా దువా చేసిన అనంతరం, అక్కడి భక్తులకు, పేదలకు 111 కేజీల జిలేబీని పంచిపెట్టి తన భక్తిని, అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సిరాజుద్దీన్ మాట్లాడుతూ, "2029లో జరిగే ఎన్నికల్లో హజరత్ ఖాజా గరీబ్ నవాజ్ కృపతో శ్రీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నాను. ఆయన ముఖ్యమంత్రి అయితేనే తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తుంది. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు తగిన న్యాయం జరుగుతుంది" అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎల్లప్పుడూ రాజగోపాల్ రెడ్డి వెంటే నడుస్తానని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన ప్రతిజ్ఞ చేశారు.

శంషాబాద్‌లో కల్తీ మద్యం దందా గుట్టురట్టు

- ప్రముఖ విదేశీ మద్యం బ్రాండ్ల పేరుతో చౌక మద్యం విక్రయాలు.. ఇద్దరు నిందితుల అరెస్ట్



రాజేంద్రనగర్, విశాల భారతి : ప్రముఖ విదేశీ మద్యం బ్రాండ్ల పేరుతో కల్తీ మద్యం విక్రయిస్తున్న అక్రమ దందాను ఎక్సైజ్ శాఖకు చెందిన డీటీఎఫ్ అధికారులు బయటపెట్టారు. తక్కువ ధరకు లభించే మద్యాన్ని ప్రముఖ బ్రాండ్లకు చెందిన ఖాళీ బాటిళ్లలో నింపి, అసలైన విదేశీ మద్యంగా నమ్మిస్తూ అధిక ధరలకు విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటన శంషాబాద్ ప్రాంతంలో కలకలం రేపింది. విశ్వసనీయ సమాచారం మేరకు డీటీఎఫ్ అధికారులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఈ అక్రమ వ్యాపారంపై దృష్టి సారించారు. డిస్టిలరీలో కార్మికుడిగా పనిచేస్తున్న వంగరి అశోక్ (43), సాఫ్ట్‌వేర్ వ్యాపారి మహమ్మద్ యాకూబ్ పాషా (29) కలిసి ఈ దందా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వీరు చౌక ధరకు లభించే డాన్సెన్స్ మద్యాన్ని సేకరించి, జానీ వాకర్, డ్యూవర్స్, 100 పైపర్స్ వంటి ప్రముఖ విదేశీ మద్యం బ్రాండ్ల ఖాళీ బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో పంగరి అశోక్ నివాసంపై డీటీఎఫ్ బృందం దాడులు నిర్వహించగా, కల్తీ మద్యంతో నింపిన 10 బాటిళ్లతో పాటు 30కి పైగా ఖాళీ మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. వీటిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.560 విలువ చేసే డాన్సెన్స్ మద్యం సీసాల నుంచి మద్యాన్ని తీసి, ఖరీదైన బ్రాండ్ల బాటిళ్లలో నింపి సుమారు 10 మందికి విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. తక్కువ ధరకు లభించే మద్యాన్ని ప్రముఖ బ్రాండ్ల పేరుతో అధిక ధరలకు విక్రయిస్తూ వినియోగదారులను మోసం చేస్తున్న ఈ వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులు మరింత లోతుగా విచారణ చేపట్టారు. ఈ అక్రమ దందాలో ఇంకా ఎవరెవరి ప్రమేయం ఉంది? మద్యం కొనుగోలు చేసిన వారు ఎవరు? ఈ వ్యాపారం ఎంతకాలంగా కొనసాగుతోంది? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కల్తీ మద్యం విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉండటంతో అధికారులు ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. అక్రమ మద్యం దందాను ఛేదించి ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సీనియర్ అధికారి నేతృత్వంలోని డీటీఎఫ్ బృందాన్ని గ్రేటర్ హైదరాబాద్ ఎక్సైజ్ అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- నల్లకంచె గురుకులంలో జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభం
- వైజ్ఞానిక ప్రదర్శనలతో ఆలోచింపచేసిన విద్యార్థుల
- ప్రభుత్వ విద్యాసంస్థలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

విశాల భారతి, ఇబ్రహీంపట్నం




విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చు చేసేందుకైనా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని నల్లకంచెలో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించిన జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో సంస్కరణలకు ఆరుట్ల పాఠశాలను ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం వెనుకాడదని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

ప్రైవేటు ఫీజుల భారానికి చెక్

ప్రైవేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజుల కారణంగా తల్లిదండ్రులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రజా ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందని మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. విద్యార్థులు 12వ తరగతి వరకు ఒకే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసుకునేలా అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించడంతో పాటు విద్యార్థుల అవసరాల కోసం కాస్మోటిక్స్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు తెలిపారు. తల్లిదండ్రులు ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం వసతులు కల్పిస్తే వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవడం విద్యార్థుల బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, వైస్ చైర్మన్ మంకాల కర్ణాకర్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షులు ఎండి గౌస్, ఆకుల యాదగిరి, శేఖర్ గౌడ్, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, బైరిక రమాకాంత్ రెడ్డి, డివై సెక్రటరీ భీమయ్య, ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ లీలావతి, చిలుకూరు, ఆమనగల్, సరూర్‌నగర్, మహేశ్వరం, కందుకూరు, శంషాబాద్ ప్రిన్సిపాల్ విద్యార్థులు పాల్గొన్నారు.

తేజస్వినిని న్యాయపోరాటానికి కుటుంబం అండ

- వీసీపై చర్యలు తీసుకోవాలని అధ్యాపకుల డిమాండ్



రాజేంద్రనగర్, విశాల భారతి : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ అధ్యాపకురాలు తేజస్వినిని మేడంకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆమె తల్లి మంగళవారం తన స్వగృహంలో నిరాహార దీక్ష చేపట్టారు. తన కుమార్తెకు జరిగిన అన్యాయంపై న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని ఆమె స్పష్టం చేశారు. ఈ దీక్షకు విశ్వవిద్యాలయ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంఘీభావం తెలిపారు. తేజస్వినిని మేడం చేసిన లైంగిక వేధింపుల ఫిర్యాదుపై ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ నమోదు కాకపోవడం, విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్యపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం, క్యాంపస్‌లో బెదిరింపులు, ఒత్తిళ్లు కొనసాగుతున్నాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయ క్యాంపస్ నుంచి అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు ఆమె నివాసానికి చేరుకుని తల్లి చేపట్టిన నిరాహార దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తేజస్వినిని తల్లి మాట్లాడుతూ..గత మూడు నెలలుగా తన కుమార్తె పడుతున్న మానసిక వేదనను దగ్గర నుంచి చూస్తున్నానని కన్నీటిపర్యంతమయ్యారు. తనకు ఎదురైన పరిస్థితులను కుమార్తె కుటుంబ సభ్యులకు వివరించినప్పటి నుంచి ఈ అంశంపై తీవ్రంగా చర్చించామని తెలిపారు. విశ్వవిద్యాలయంలో మరే విద్యార్థికి, అధ్యాపకురాలికి ఇలాంటి పరిస్థితి ఎదురుకాకూడదనే ఉద్దేశంతో కుటుంబమంతా న్యాయపోరాటానికి సిద్ధమైందన్నారు. ప్రతి విద్యార్థి ఎలాంటి భయం లేకుండా చదువుకునే వాతావరణం ఉండాలని, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది గౌరవప్రదంగా విధులు నిర్వహించే పరిస్థితులు కల్పించాలని కోరారు. ఎవరైనా వేధింపులకు గురైతే ధైర్యంగా ఫిర్యాదు చేసే స్వేచ్ఛ ఉండాలని, ఫిర్యాదు చేసిన వారికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులకు అండగా నిలిచేవారిని బెదిరింపులకు గురిచేయడం సరికాదన్నారు. తన కుమార్తెకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. తన ఇంటికి వచ్చి సంఘీభావం తెలిపిన అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

మణికొండకు నార్సింగి సర్కిల్ కార్యాలయం.. కాంగ్రెస్ నేతల హర్షం



రాజేంద్రనగర్, విశాల భారతి : నార్సింగి సర్కిల్ కార్యాలయాన్ని మణికొండకు తరలించడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో మణికొండ మున్సిపాలిటీ హయాంలో నిర్మించిన విశాలమైన ప్రభుత్వ భవనం ప్రస్తుతం నార్సింగి సర్కిల్ కార్యాలయంగా వినియోగంలోకి రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజాధనంతో నిర్మించిన భవనాలు ప్రజలకు ఉపయోగపడినప్పుడే వాటి నిర్మాణానికి సార్థకత చేకూరుతుందని అన్నారు. కార్యాలయం మణికొండకు అందుబాటులోకి రావడంతో మణికొండ, నెక్నాంపూర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువవుతాయని తెలిపారు. ఈ మేరకు మణికొండ డివిజన్ 127, నెక్నాంపూర్ డివిజన్ 128కు చెందిన కాంగ్రెస్ నాయకులు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రాంతీయ అభివృద్ధి సమస్యలపై వినతిపత్రం అందజేసి చర్చించారు. కార్యాలయ తరలింపునకు కృషి చేసిన ప్రభుత్వ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కాలనీల్లో పెండింగ్‌లో ఉన్న భూగర్భ మురుగునీటి కాలువల పనులను పూర్తి చేయాలని, దెబ్బతిన్న కాలువలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. రహదారుల నిర్మాణం, మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని లింక్ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వివిధ కాలనీలను ప్రధాన రహదారులతో అనుసంధానం చేసేలా రోడ్ల అభివృద్ధి చేపడితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని వివరించారు. ఇప్పటికే ప్రారంభించిన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు భవిష్యత్తులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు ప్రాధాన్యత క్రమంలో నిధులు కేటాయించాలని కోరారు. నాయకులు ప్రస్తావించిన సమస్యలను సానుకూలంగా పరిశీలించిన డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి సంబంధిత అంశాలపై అవసరమైన చర్యలు తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు.

చౌటుప్పలలో రైతుల వడ్ల కొనుగోలులో తీవ్ర జాప్యం

- వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్
- బీఆర్ఎస్ పార్టీ చౌటుప్పల మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి



చౌటుప్పల్, విశాలభారతి: చౌటుప్పల మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని రైతులు పండించిన వడ్లను కొనుగోలు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని బీఆర్ఎస్ పార్టీ చౌటుప్పల మున్సిపాలిటీ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. చౌటుప్పల మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు ఎంతో కష్టపడి, అప్పులు చేసి పండించిన వడ్లు రైతు కల్లాలలోనే పేరుకుపోయి, నెలల తరబడి అలాగే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కల్లాల్లోనే మగ్గుతున్న వడ్లు: పంట కోసి మూడు నెలలు దాటినా ఇప్పటివరకు పిఏసియస్ కేంద్రాల వద్ద కానీ, వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద కానీ సరైన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదని ఆయన ఆరోపించారు. దీంతో కల్లాల్లో ఆరబోసిన వడ్లు ఎండకు ఎండుతూ, అకాల వర్షాలకు తడుస్తూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు.

దళారుల చేతిలో దోపిడీ: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు తప్పనిసరి పరిస్థితుల్లో తమ పంటను దళారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోందని, దీంతో పెట్టుబడి కూడా రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వానికి విన్నపాలు చేసినా స్పందన లేదు: ఈ విషయంపై అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా, ఎవరూ స్పందించడం లేదని, రైతుల బాధలను పట్టించుకునే నాథుడే లేడని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసిన పరిస్థితి ఉండేదని, కానీ ప్రస్తుత ప్రభుత్వం రైతులను పూర్తిగా గాలికి వదిలేసిందని అన్నారు.

బీఆర్ఎస్ డిమాండ్: ప్రభుత్వం వెంటనే స్పందించి, చౌటుప్పల మున్సిపాలిటీ మరియు మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల నుండి వెంటనే వడ్లను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను కలుపుకుని పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వెంకట్ రెడ్డి హెచ్చరించారు.

సీఎంఆర్ ఎఫ్ నిధుల శాతం పెంచాలి

- చెక్కుల పంపిణీలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్

విశాలభారతి, ఇందూరు : సీఎంఆర్ఎఫ్ బిల్లులను సుమారు 50 శాతం ఇవ్వాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల క్యాంపు కార్యాలయంలో మంగళవారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని పేదలకు సీఎంఆర్ఎఫ్ ఒక వరంలాంటిదన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలు వినియోగించుకునే ఈ పథకంలో 20 శాతం మాత్రమే ఇస్తున్నారన్నారు. అలాగే నియోజకవర్గంలోని ప్రజలకు ఆరోగ్యపరంగా ఎటువంటి అవసరం ఉన్నా.. ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య మందేలా చూస్తానన్నారు. ప్రధానంగా దీర్ఘకాలిక వ్యాధులు, శస్త్ర చికిత్సలు అవసరమైతే నిమ్స్ లో కూడా వైద్యం అందేలా ఎల్ వోసీ ఇచ్చి సహకరిస్తామన్నారు. అలాగే బీబీ నగర్ లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎయిమ్స్ లోనూ అద్భుతమైన వైద్యం అందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్లు మఠం పవన్, జగదీష్‌కులకర్ణి, మల్కాయి మహేందర్, విజయ మల్లేష్ యాదవ్, న్యాలం సునీత రాజు, కల్పే అర్చనా చిరంజీవి, జ్యోతి మురళి, నాయకులు పంచరెడ్డి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా గో సడక్ బంద్



- గోశాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- వారం రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలనకు కలెక్టర్ హామీ
- గోవుల సంరక్షణకు పోలీసు శాఖ పూర్తి సహకారం : ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు

విశాల భారతి, ఇబ్రహీంపట్నం / అబ్దుల్లాపూర్ మెట్ :

గోవుల సంరక్షణ, గోశాలల పరిరక్షణ కోరుతూ ఇబ్రహీంపట్నం డివిజన్ పరిధిలో నిర్వహించిన 'గో సడక్ బంద్' కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన రైతులు, గోసంరక్షకులు, గోప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని గోశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా పోలీసు శాఖ తగిన ఏర్పాట్లు చేపట్టింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం జోన్ డీసీపీ నారాయణ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించారు. ఇంటర్మీడియట్ కస్టడీలో ఉన్న సుమారు 300కు పైగా ఆవులు, దూడలు, ఎద్దుల సంరక్షణకు సంబంధించి గోశాలల్లో ఎదురవుతున్న పశుగ్రాసం, తాగునీరు, విద్యుత్ వంటి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. గోవుల అక్రమ రవాణాపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని, నిబంధనలకు విరుద్ధంగా గోవులను తరలించే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని డీసీపీ స్పష్టం చేశారు. జిల్లా వెటర్నరీ అధికారి అంకం రాజు, వైద్యుల బృందం సైతం గోశాలను సందర్శించి మూగజీవాల ఆరోగ్య పరిస్థితులు, వైద్య సేవలను సమీక్షించారు.

గోశాలల సమస్యలపై ప్రత్యేక సమావేశం..

గోశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా టీటీడీ మాజీ బోర్డు సభ్యులు, యుగ తులసి ఫౌండేషన్ చైర్మన్ కె. శివకుమార్‌తో కలెక్టర్ ఫోన్‌లో మాట్లాడారు. గోశాలల్లో పశుగ్రాస కొరత, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల సమస్యలను శివకుమార్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ త్వరలోనే ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి, గోశాలల సమస్యలపై పూర్తి నివేదికలను ప్రభుత్వానికి సమర్పించి శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రానున్న వారం రోజుల్లో గోశాలలను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిస్తామని వెల్లడించారు. గోవుల సంరక్షణ, గోశాలల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారం, అక్రమ రవాణా నిరోధం, శాంతిభద్రతల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేస్తాయని ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు తెలిపారు. గోవుల సంరక్షణకు సంబంధించి చట్టపరిధిలో అవసరమైన సహకారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమం లో అబ్దుల్లా పూర్ మెట్ ఇన్స్పెక్టర్ సి హెచ్ రాజు, సబ్ ఇన్స్పెక్టర్ సైదులు తో పాటు అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నూతన చేయూత పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు

- 18న పెద్ద అంబర్‌పేట్ తారా కన్వెన్షన్‌లో కార్యక్రమం
- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల అందజేత

విశాల భారతి, అబ్దుల్లాపూర్‌మెట్ : అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ బుధవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి యు. శ్రీవాణి తెలిపారు. పెద్ద అంబర్‌పేట్ పరిధిలోని తారా కన్వెన్షన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లను అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో కుంట్లూరు, పెద్ద అంబర్‌పేట్ డివిజన్లతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన నూతనంగా చేయూత పింఛన్లు మంజూరైన లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ జరగనుంది. ఈ సందర్భంగా మండలానికి చెందిన అర్హులైన లబ్ధిదారులు నిర్దిష్ట సమయానికి కార్యక్రమానికి హాజరుకావాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రస్తుత ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు పాల్గొననున్నారు.



అర్హులకు చేయూత పెన్షన్ల పంపిణీ



విశాల భారతి, అబ్దుల్లాపూర్ మెట్ : పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో బుధవారం నిర్వహించనున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బింగి దేవదాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమం నవంబర్ 18వ తేదీ బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పెద్ద అంబర్‌పేట్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని తారా కన్వెన్షన్‌లో జరగనుందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా బింగి దేవదాస్ గౌడ్ మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేయూత పెన్షన్లను అందిస్తోందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు సకాలంలో కార్యక్రమానికి చేరుకుని పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నందివనపర్తికి గ్రామానికి 41 నూతన పెన్షన్లు మంజూరు



- అర్హులైన పేద వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు భరోసా
- పెన్షన్ల మంజూరు పత్రాలను అందజేత
- లబ్ధిదారులు ఆనందం హర్షం
- బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి

విశాల భారతి ఇబ్రహీంపట్నం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లలో భాగంగా యాచారం మండల పరిధిలోని నందివనపర్తి గ్రామానికి 41 నూతన పెన్షన్లు మంజూరయ్యాయి. మంగళవారం ఇబ్రహీంపట్నంలోకేంద్రంలోని శాస్త్ర గార్డెన్ లో నిర్వహించిన పెన్షన్లు పంపిణీ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా, బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్హులైన లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా బిఎన్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేద వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు ఎంతో ఉపయోగకరంగా తోడ్పడునందిస్తాయని, లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు కావడంతో సంతోషం వ్యక్తం చేశారని, అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు, రేషన్ కార్డులు, ఉచిత బస్సు ప్రయాణం, వృద్ధులకు దివ్యాంగులకు పెన్షన్లు అర్హులైన ప్రతి ఒక్కరికి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారధ్యంలో లబ్ధి చేకూరేలా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల కోసమే ప్రభుత్వం పనిచేస్తుందని, ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు నూకం శ్రీలత-మహేందర్, తెల్గమల్ల భవాని-నరేందర్, మహ్మద్ హాజీ, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్రె శ్రీశైలం, పార్టీ సీనియర్ నాయకులు తెల్గమల్ల రవి, ముచ్చర్ల సాయి కిరణ్, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలే విజ్ఞానానికి నిలయాలు



విశాల భారతి, ఎల్ బి నగర్ : హయత్‌నగర్‌లోని హైకోర్టు కాలనీ డివిజన్ పరిధి కమలా నగర్ కాలనీలో సోమవారం సాయంత్రం నిర్వహించిన గ్రంథాలయ వార్షికోత్సవ వేడుకల్లో హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కల్లెం నవజీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులకు, సభ్యులకు వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కల్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ..గ్రంథాలయాలు సమాజ అభివృద్ధికి, విజ్ఞాన వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో పఠనాసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు గ్రంథాలయాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం, ఆలోచనా శక్తి, సామాజిక అవగాహన పెరుగుతాయని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నేటి డిజిటల్ యుగంలోనూ గ్రంథాలయాల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదని, వాటిని మరింత అభివృద్ధి చేసి భావితరాలకు విజ్ఞాన కేంద్రాలుగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న నిర్వాహకులను, సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు గోకుల మదన్ రెడ్డి, కమలా నగర్ నివాసుల సంక్షేమ సంఘం సభ్యులు గణేష్, తుమ్మల సుబ్బారావు, టీవీ రావు, రామారావు, తవుటం సంగ్రామ్, గాండ్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా మేడారం అపర్ణ ప్రదీప్

- కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ అభ్యున్నతి కోసం కష్టపడతా..!



విశాలభారతి, నిర్మల్ : వరంగల్ లోని తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా తెలంగాణ రాష్ట్రం లోని మహిళా జిల్లా అధ్యక్షుల నియామకపత్రాలను అందించారు. దీనిలో భాగంగా నిర్మల్ జిల్లాకు చెందిన మేడారం అపర్ణ ప్రదీప్ కు నిర్మల్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా తెలంగాణా ప్రభుత్వం నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భముగా మేడారం అపర్ణ ప్రదీప్ మాట్లాడుతూ తనకు అందించిన ఈ బాధ్యతలనకు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లకు ప్రత్యేక ధన్యవాదములు తెలుపుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నిర్మల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, డి.సి.సి అధ్యక్షులు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు, ఖానాపూర్ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, నిర్మల్ నియోజకవర్గ కాగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు, ముధోల్ నియోజక వర్గ మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి ,నారాయణ రావు పటేల్,నిర్మల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి లు, మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు అల్లూరి కృష్ణవేణి రాష్ట్ర పత్తి రెడ్డి రాజేశ్వర్ రెడ్డి లకు కృతజ్ఞతలు తెలిపారు. తప్పకుండా పార్టీకి, తన పదవికి తనవంతు కృషి చేస్తూ జిల్లాలోని మహిళల కోసం సముచితస్థానం కల్పిస్తూ , అందరి సహకారం తో పార్టీని ముందుకు తీసుకెళ్తానని పేర్కొన్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి జిల్లాలో పార్టీ అధినేతకి తన వంతుగా భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని ముందుకు వె

శూర్పణఖ పాత్ర మేకప్ కోసం
అంత టైమ్ పట్టేది!

కొన్నిరకాల పాత్రలు చేయడానికి నటీనటులు ఎంతో కష్టపడాల్సి వస్తుంటుంది. పాత్రలోకి ఒదిగిపోవడం కోసం శ్రద్ధ పెట్టడంతో పాటు ఓర్పు ఎంతో అవసరం. పాత్రను బట్టి ఆహార్యాన్నిమార్చుకోవడంతో పాటు ప్రతీరోజు మేకప్ కోసం గంటల తరబడి సమయాన్ని వెచ్చించాల్సి ఉంటుంది. ఈ విషయంలో ఒకప్పుడు పౌరాణిక పాత్రలకు ప్రాణప్రతిష్ట చేసిన సీనియర్ ఎన్టీఆర్ ను ఎందరో నటీనటులు స్ఫూర్తిగా తీసుకున్న విషయం తెలియంది కాదు. అలాగే సాంఘిక పాత్రల విషయంలో ఆశ్చర్యపోయేవిధంగా కమల్ హాసన్, విక్రమ్ వంటి వారు పూర్తిస్థాయిలో ట్రాన్స్ ఫర్మేషన్ కావడం చూస్తున్నదే. ఇప్పుడు స్టార్ హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ కూడా శూర్పణఖ పాత్ర మేకప్ కోసం ఎంతో ఓర్పు వహించారట. ఇటీవల ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాల మధ్య విడుదలైన 'రామాయణం' సినిమాకు చక్కటి ప్రేక్షకాదరణ లభిస్తున్న నేపథ్యంలో ఆ చిత్రంలోని పలువురు పాత్రధారులతో పాటు శూర్పణఖ క్యారెక్టర్ చేసిన రకుల్ ప్రీత్ సింగ్ కు కూడా పేరొచ్చింది. నిన్నా, మొన్నటివరకు తెలుగులో బిజీగా సినిమాలు చేసిన ఆమె ఇప్పుడు బాలీవుడ్, తమిళ సినిమాలలో అవకాశాలు వస్తున్నాయి. గ్లామర్ కు చక్కటి ఉదాహరణగా చెప్పుకునే ఆమె తనకు లభించిన రాక్షసి అయిన శూర్పణఖ పాత్రను సైతం అంగీకరించి, ప్రేక్షకులను అలరించారు. అయితే ఆ గెటప్ కోసం ఎంత కష్టపడ్డారు, మేకప్ కోసం ఎంత టైమ్ వెచ్చించారన్న విషయాన్ని తాజాగా పోస్ట్ చేసిన వీడియోలో రకుల్ స్పష్టంచేశారు. ఈ వీడియో ఇప్పుడు వైరల్ గా మారింది. కేవలం ఆమె ధరించిన కాస్ట్యూమ్స్ ను చూసి, ఆమె పెద్దగా కష్టపడింది ఏముంది? అని కొందరు అనుకోవచ్చు. కానీ ఆ పాత్ర లుక్ కోసం ఆమె ప్రతీరోజు నాలుగు గంటల సమయాన్ని కేటాయించేవారట. హెయిర్, మేకప్, కాస్ట్యూమ్స్, ఆభరణాలు వంటివన్నీ కలుపుకుని అంత సమయం పట్టేదట. దీంతో రామాయణం చిత్రంలోని శూర్పణఖ పాత్రతో రకుల్ ప్రీత్ సింగ్ మరోసారి వార్తల్లో నిలిచారు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.